తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460



ఎడిటర్: గద్దం నాగరాజు

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

మంగళవారం

17 డిసెంబర్ 2024

సంపుటి : 02

సంచిక : 179

పేజీలు : 12

వెల రూ.5.00

Epaper : WWW.tharangalu.comEpa

Published From: Hyderabad,Circulated: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,sangareddy,Warangal,Kurnool,Kadapa,Amaravathi,Krishna




## జై శ్రీరామ్ నినాదం నేరమెలా అవుతుంది?

- మసీదు లోపల నినాదాలు చేసిన వారిని గుర్తించారా ?
- ప్రశ్నించిన సుప్రీం కోర్టు

తరంగాలున్యూఢిల్లీ

జై శ్రీరామ్ అన్న నినాదం క్రిమినల్ నేరమెలా అవుతుందని సుప్రీం కోర్టు సోమవారం ప్రశ్నించింది. మసీదు లోపల జై శ్రీరామ్ అని నినాదాలు చేశారని ఆరోపిస్తూ ఇద్దరు వ్యక్తులపై వేసిన కేసును కర్ణాటక హైకోర్టు -మిగతా 3 లో




## రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌కు పట్టదు

- పెద్దల సభ ఔన్నత్యాన్ని తగ్గించడం సరికాదు
- మండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి
- బీఆర్ఎస్ సభ్యుల నిరసన

హైదరాబాద్‌తరంగాలు

'ఇది పెద్దల సభ. సభ్యులు సభా సంప్రదాయాలను పాటించాలి. గౌరవాన్ని కాపాడాలి. కానీ బీఆర్ఎస్ సభ్యులు సభా మర్యాదను -మిగతా 3 లో




## గ్రేటర్ గజ గజ

రికార్డు స్థాయిలో పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు

హైదరాబాద్‌తరంగాలు

గ్రేటర్‌లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతుండడంతో చలి పులి నగరాన్ని గజ గజ వణికిస్తోంది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు నగరంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 29.3 డిగ్రీలు నమోదవ్వగా, రాజేంద్రనగర్‌లో కనిష్ఠం ఉష్ణోగ్రతలు అత్యల్పంగా 8.5 డిగ్రీలు, నగరంలో 11.4 డిగ్రీలు, -మిగతా 3 లో



# బీఆర్ఎస్-కాంగ్రెస్ ఢీ అంటే ఢీ

కాంగ్రెస్, బీఆర్ఎస్ పోటాపోటీగా విమర్శలు

- అలా మొదలై..ఇలా వాయిదా..
- ప్రశ్నోత్తరాల తర్వాత పదే పది నిమిషాలు సాగిన అసెంబ్లీ
- సభ లోపలా బయటా గులాబీదళం నిరసనలు
- నేటికి వాయిదా

తరంగాలు-హైదరాబాద్

అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ 'ఢీ అంటే ఢీ' అంటూ తలబడ్డాయి. ఇరు పార్టీలు ప్రతిష్ఠకుపోయాయి. పర్యాటక విధానంపై సర్కారు చర్చను ప్రారంభించగా, లగచర్ల రైతుకు బేడీలపై చర్చకు -మిగతా 3 లో




## ఫార్ములా వన్ కేసుపై గవర్నర్ గ్రీన్ సిగల్

- సీఎస్ ఆ దస్త్రాన్ని త్వరలోనే ఏసీబీకి పంపిస్తారు
- చట్ట ప్రకారం దర్యాప్తు :మంత్రి పొంగులేటి

హైదరాబాద్‌తరంగాలు

'ఫార్ములా వన్'కేసుకు సంబంధించి మాజీ మంత్రి కేటీఆర్‌ను విచారించేందుకు ప్రభుత్వానికి గవర్నర్ నుంచి అనుమతి లభించిందని రాష్ట్ర మంత్రి -మిగతా 3 లో



## మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

- 25 వరకు నిర్వహణ
- జనవరి 31, ఫిబ్రవరి 1న ఇంగ్లీష్ ప్రాక్టికల్స్
- ఫిబ్రవరి 3 నుంచి 22 వరకు ప్రాక్టికల్స్
- జనవరి 29న నైతికత, మానవ విలువలు, 30న పర్యావరణ విద్య పరీక్ష
- టైంటేబుల్ విడుదల

హైదరాబాద్‌తరంగాలు

రాష్ట్రంలో ఇంటర్మీడియెట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థుల వార్షిక పరీక్షలు మార్చి ఐదు నుంచి ప్రారంభమవుతాయి. ఈ పరీక్షలు అదేనెల 25 వరకు జరుగుతాయి. జనరల్‌తోపాటు ఒకేషనల్ విద్యార్థులకూ ఇదే షెడ్యూల్ వర్తించనుంది. ఇంటర్ ప్రథమ -మిగతా 3 లో



## 21వరకే అసెంబ్లీ!

బీఏసీ నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం వాకౌట్

-15 రోజులు నిర్వహించాలంటూ పట్టు

-హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు మరో ఐదు రోజుల పాటు జరుగనున్నాయి. ఈనెల 9న ప్రారంభమై వాయిదా పడిన అసెంబ్లీ సమావేశాలు తిరిగి సోమవారం నుంచి షురూ అయ్యాయి. ఈనెల 21 వరకు కొనసాగనున్నాయి. సోమవారం అసెంబ్లీలోని స్పీకర్ చాంబర్‌లో గడ్డం ప్రసాద్‌కుమార్ అధ్యక్షతన బిజినెస్ అడ్వయిజరీ -మిగతా 3 లో



## పరస్పర సహకారంతో ముందడుగు

- ప్రాంతీయ శాంతి, భద్రత, అభివృద్ధికి కొలంబో వేదిక
- శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే
- త్వరలో ఇరు దేశాల మధ్య రక్షణ ఒప్పందం : ప్రధాని మోడీ

న్యూఢిల్లీ:తరంగాలు

భారత్ -శ్రీలంకల మధ్య త్వరలో రక్షణ సహకార ఒప్పందం కుదుర్చుకోవాలని నిర్ణయించినట్టు సోమవారం ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. -మిగతా 3 లో

## ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

రుణాలపై తప్పులు నివేదిక సమర్పించిన కాంగ్రెస్

రూ.3.89 లక్షల కోట్లు ఉందని ఆర్‌ఐబీ చెబితే రూ.7 లక్షల చూపి తప్పుదోవ

విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కేటీఆర్

హైదరాబాద్, తరంగాలు

కాంగ్రెస్ ప్రభుత్వం తమ రాజకీయ ప్రయోజనాల కోసం బీఆర్ఎస్‌పై తప్పుడు నివేదికలు వెల్లడించిందని మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. ఆర్థిక మంత్రి ప్రసంగం పూర్తిగా అవాస్తవమని "హ్యాండ్ బుక్ ఆఫ్ స్టాటిస్టిక్స్ ఆన్ ఇండియన్ స్టేట్స్" పేరుతో ఆర్బీఐ విడుదల చేసిన నివేదికలో నిరూపితమైందని కేటీఆర్ అన్నారు. 2014-15లో తెలంగాణ మొత్తం రుణాలు రూ.72 వేల 658 కోట్లు ఉండగా, 2024 మార్చి నాటికి ఈ రుణాల మొత్తం రూ. 3,89, 673 కోట్లకు చేరిందని ఆర్‌బీఐ వెల్లడించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చిన -మిగతా 3 లో



# కెనడా డిప్యూటీ ప్రధాని రాజీనామా

-ట్రంప్ టారిఫ్‌లపై విభేదాలే కారణం



**ఒట్టావా :తరంగాలు**

ట్రంప్ టారిఫ్‌లపై ప్రధాని జస్టిన్ ట్రూడేతో తలెత్తిన విభేదాల నేపథ్యంలో సోమవారం రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈనాడు మన దేశం తీవ్రమైన సవాలును ఎదుర్కొంటోందని ఆమె వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె ఎక్స్‌లో పోస్టు పెట్టారు. కెనడాకు అత్యుత్తమమైన మార్గమేది అనే విషయంలో మనిద్దరి మధ్య గత కొద్ది వారాలుగా విభేదాలు నెలకొన్నాయని ఆమె అందులో పేర్కొన్నారు. 2013లో తొలిసారిగా పార్లమెంట్‌కు ఎన్నికైన ఫ్రీలాండ్ రెండేళ్ల తర్వాత ట్రూడే కేబినెట్‌లో చేరారు. వాణిజ్య, ఆర్థిక, విదేశాంగ మంత్రిగా కీలకమైన పదవులు నిర్వహించారు. తనను వేరే పదవికి మార్చాలని ట్రూడే భావిస్తున్నారని, ఇటువంటి తరుణంలో తాను కేబినెట్ నుండి వైదొలగడమే మంచిదనే నిర్ణయానికి వచ్చినట్లు ఆమె ఆ పోస్టులో తెలిపారు. ట్రంప్ టారిఫ్‌ల బెదిరింపులను తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరముందని ఆర్థిక మంత్రిగా ఆమె నొక్కి చెప్పారు. రాబోయే టారిఫ్ యుద్ధానికి మనం సన్నద్ధం కావాల్సి వుందన్నారు. కెనడా ప్రధాన వాణిజ్య భాగస్వామి అయిన అమెరికాకు 75శాతం ఎగుమతులు వెళతాయి.

# మహిళల భద్రతలో కేంద్రం విఫలం

: కేజ్రీవాల్



**న్యూఢిల్లీ తరంగాలు**

ఢిల్లీలో మహిళల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని ఆప్ జాతీయ కన్వీనర్ కేజ్రీవాల్ విమర్శించారు. ఇక్కడి త్యాగరాజ్ స్టేడియంలో నిర్వహించిన మహిళా అదాలత్ కార్యక్రమంలో కేజ్రీవాల్ ప్రసంగించారు. ఢిల్లీ పోలీసులపై కేంద్రానికి అధికారాలు ఉన్నప్పటికీ బిజెపి ప్రభుత్వం మహిళల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వలేదని ఆరోపించారు. 'పదేళ్ల క్రితం మీరు ఢిల్లీలో పాఠశాలలు, ఆసుపత్రులు, నీటి సరఫరాను మెరుగుపరచడానికి నాకు బాధ్యతలు అప్పగించారు. నేను నా బాధ్యతలు నిర్వహించాను. అయితే మీరు బిజెపికి, అమిత్‌షాకు హెూం బాధ్యతలు ఇచ్చారు. వారు విఫలం చెందారు' అని కేజ్రీవాల్ అన్నారు. మహిళలను ఓటు బ్యాంకుగా ఆప్ పరిగణించదని, వారి భద్రత కోసం తన శక్తి మేరకు కృషి చేశానని తెలిపారు. 'ఆప్ అధికారంలోకి రాకముందు నగరంలో సిసిటివి కెమెరాలు లేవు. ప్రజల భద్రతను పెంచేందుకు సిసిటివి కెమెరాలను ఏర్పాటు చేసి బస్ మార్షల్స్‌ను నియమించాం' అని కేజ్రీవాల్ తెలిపారు.

# నెక్కొండ మున్సిపాలిటీకి ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిన నెక్కొండ గ్రామస్థులు

-కృతజ్ఞతలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు హరిప్రసాద్





**తరంగాలు,నర్సంపేట ఆర్సీ,16డిసెంబర్**

నెక్కొండ మున్సిపాలిటికి గ్రామస్థులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.సోమవారం నెక్కొండ మేజర్ గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో జరిగిన గ్రామసభకు నెక్కొండ గ్రామస్థులు అధిక సంఖ్యలో హాజరై,నెక్కొండ గ్రామ పంచాయతీని నెక్కొండ మున్సిపాలిటీగా అప్ గ్రేడ్ చేయడం కోసం ఏకగ్రీవంగా తీర్మానం చేసి,తమ ఆమోదం తెలిపిన నెక్కొండ పట్టణ ప్రజలందరికీ నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ తరపున నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెండ్యాల హరిప్రసాద్ పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.

# పార్లమెంట్‌కు పాలస్తీనా బ్యాగ్‌తో ప్రియాంక గాంధీ



**న్యూఢిల్లీ తరంగాలు**

కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ మరోసారి పార్లమెంటు వద్ద అందరి దృష్టిని ఆకర్షించారు. అయితే అదే సమయంలో వివాదం కూడా చోటు చేసుకుంది. సోమవారం పార్లమెంట్ సమావేశాలకు హాజరయ్యేందుకు ఓ ప్రత్యేక బ్యాగ్‌తో ప్రియాంక అక్కడికి వచ్చారు. దానిపై 'పాలస్తీనా ' అనే రాతలు ఉండటం, ఆ ఫొటోను కాంగ్రెస్ ప్రతినిధి డాక్టర్ షామ మహమ్మద్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో పోస్ట్ చేయడం వివాదానికి దారితీసింది. దయ, న్యాయనిబద్ధత, మానవత్వానికి ఇది సంకేతమని, జెనీవా కన్వెన్షన్‌ను ఎవరూ ఉల్లంఘించరాదనే సందేశం ఇందులో ఉందని ఆయన అన్నారు. కాగా, ఇది ముస్లింలను బుజ్జగించే చర్యగా బీజేపీ సర్వసాధారణంగా చేసే విమర్శలే చేసింది. ప్రియాంక గాంధీ ఒక ప్రత్యేక బ్యాగ్‌తో పాలస్తీనాకు తన సంఘీభావం తెలిపినట్టు ఒక నెజిజన్ వ్యాఖ్యానించారు. తూర్పు పాకిస్థాన్‌పై మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పాకిస్థాన్ శక్తులను ఓడించిన 'విజయ్ దివస్' రోజు హమాస్ వంటి సంస్థలకు ప్రియాంక మద్దతు చెప్పడం మంచి అభిరుచి కాదని మరొకరు విమర్శించారు. పాక్‌పై భారత్ విజయాన్ని ప్రతిబింబించే అంశంతో ప్రియాంక వచ్చి ఉంటే బాగుండేదని ఇంకొకరు అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, ఇందిరా గాంధీ మనుమరాలైన ప్రియాంక గతంలో కూడా గాజాపై ఇజ్రాయిల్ చర్యను వ్యతిరేకిస్తూ పాలస్తీనీయులకు సంఘీభావం ప్రకటించారు. కేరళలోని వాయనాడ్‌లో ప్రియాంక గాంధీ గెలుపును ఢిల్లీలోని పాలస్తీనా కార్యాలయ ప్రతినిధి అబెడ్ ఎల్రాజెగ్ అబు జజెర్ ఇటీవల అభినందించారు. ఇజ్రాయిల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై గత జులైలో ప్రియాంక విమర్శలు గుప్పిస్తూ, గాజాలో ఇజ్రాయిల్ ప్రభుత్వం నరమేధం సాగిస్తోందని తప్పుపట్టారు. యుఎస్ కాంగ్రెస్‌లో ఇజ్రాయిల్ చర్యను సమర్థించుకుంటూ నెతన్యాహు ఉపన్యసించిన వెంటనే ప్రియాంక ఈ వ్యాఖ్యలు చేశారు. గాజాలో జరుగుతున్న ఊచకోతలకు పౌరులు, తల్లులు, తండ్రులు, వైద్యులు, నర్సులు, సహాయక వర్కర్లు, పాత్రికేయులు, టీచర్లు, రచయితలు, సీనియర్ సిటిజన్లు, వేలాది మంది అమాయక పిల్లలు ప్రతిరోజూ ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. విద్వేషం, హింసను ఇష్టపడని ఇజ్రాయిల్ పౌరులతో సహా, ప్రతి ఒక్కరికీ ఈ నరమేధాన్ని ఖండించాల్సిన నైతిక బాధ్యత ఉందని ఒక ట్వీట్‌లో ఆమె పేర్కొన్నారు. నాగరికత, నైతికతకు కట్టుబడే ప్రపంచంలో ఇజ్రాయిల్ చర్యలు ఆమోదయోగ్యం కావని అన్నారు

# సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు

- రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ
- శాసనమండలిలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**హైదరాబాద్‌తరంగాలు**

రాష్ట్రంలో సంక్రాంతి తర్వాత కొత్త రేషన్ కార్డులు ఇచ్చే ప్రక్రియను ప్రారంభించనున్నట్లు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సోమవారం శాసనమండలిలో ప్రశ్నోత్తరాల సందర్భంగా సభ్యులు ప్రొఫెసర్ ఎం.కోదండరామరెడ్డి, మిర్జా రియాజుల్ హసన్ ఎఫెండి, మిర్జా రహమత్ బేగ్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ప్రభుత్వ అంచనా ప్రకారం కొత్తగా 10 లక్షల రేషన్ కార్డులు అవసరమవుతాయని తెలిపారు. వీటితో 31 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుందన్నారు. వీటి మంజూరీలో కులగణన సర్వేను ఆధారం చేసుకుంటామని స్పష్టం చేశారు. కొత్త వాటితో ప్రభుత్వంపై రూ.956 కోట్ల అదనపు భారం పడుతుందన్నారు. రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల్లో పేర్ల నమోదుకు 18 లక్షల దరఖాస్తులు వచ్చాయని చెప్పారు. కొత్త రేషన్ కార్డుల మంజూరీలో పరిగణనలోకి సక్సేనా కమిటీ సిఫారసులు, ప్రజా ప్రతినిధుల సూచనలు తీసుకున్నామన్నారు. ఖాళీగా ఉన్న చౌకధరల దుకాణాల డీలర్ల భర్తీకి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీ, తండాల గ్రామ పంచాయతీలలో కొత్త చౌకధరల దుకాణాలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. దొడ్డు బియ్యం దారి తప్పుతున్న మాట వాస్తవమేనని అంగీకరించారు. అందుకే సంక్రాంతి తర్వాత తెల్ల రేషన్ కార్డుదారులందరికీ సన్నబియ్యం పంపిణీ చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో అదనపు పేర్ల నమోదుకు గాను మీ సేవ కేంద్రం ద్వారా గడిచిన పదేండ్లుగా వచ్చిన 18 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు, ఆ సంఘం అందరి సూచనలు స్వీకరించి క్యాబినెట్ ఆమోదం కోసం సిఫారసులు పంపించిందని వివరించారు. నిత్యావసర వస్తువులను పంపిణీ చేసే ఆలోచన లేదనీ, అలాంటిది ఏదైనా ఉంటే క్యాబినెట్‌లో చర్చించి సమిష్టి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణ ప్రాంతంలో 91,68,231 రేషన్ కార్డులు, 3.38 కోట్ల లబ్దిదారులనీ, తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు తరలివెళ్లిన వారి 2,46,324 కార్డులు రద్దయ్యాయని చెప్పారు. తెలంగాణలో 2.7 కోట్ల మంది లబ్దిదారులు, 89,21,907 తెల్లరేషన్ కార్డులున్నాయని వివరించారు. కొత్తగా ఏర్పడ్డ తెలంగాణా రాష్ట్రం సిరీస్‌కు కొత్త ఆహారభద్రత కార్డులు అనుసంధానం చేశామన్నారు.

అదనంగా 2016 నుండి 2023 వరకు కొత్తగా 20,69,000 మంది లబ్దిదారులకు 6,47,479 ఆహార భద్రతా కార్డులు మంజూరు చేశారన్నారు. అదే కాలంలో 19 లక్షల మంది లబ్దిదారులను అనర్హులుగా గుర్తించి 5,98,000 ఆహార భద్రత కార్డులు తొలగించారన్నారు. అంటే గడిచిన పదేండ్లలో 86 వేల మంది లబ్దిదారులకు తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేసినా జారీ చేసింది 49 వేలు మాత్రమేనని స్పష్టం చేశారు. దీంతో ప్రస్తుతం రాష్ట్రంలో 89.95 లక్షల తెల్ల రేషన్ కార్డులతో 2.81 కోట్ల మంది లబ్దిదారులున్నారని చెప్పారు. జాతీయ ఆహార భద్రత కింద కేంద్ర ప్రభుత్వం 54 లక్షల కార్డులు అందించగా కోటి 91 లక్షల మందికి రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న 35 లక్షల ఆహార భద్రతా కార్డులతో 89 లక్షల మంది ప్రయోజనం పొందుతున్నారని ఆయన సభకు వివరించారు.

# సిరియాపై ట్రంప్‌తో నెతన్యాహు చర్చలు

- సిరియాతో బ్రిటన్ దౌత్య సంబంధాలు
- 50మిలియన్ల పౌండ్ల ఆర్థిక సాయం
- గోలన్ హైట్స్ విస్తరణకు ప్రయత్నాలు



**జెరూసలేం, గాజా తరంగాలు**

సిరియాలోని పరిణామాలపై, గాజాలో హమాస్ చెరలోని బందీల విడుదలపై ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహు, అమెరికా అధ్యక్షుడుగా ఎన్నికైన ట్రంప్‌తో ఆదివారం చర్చించారు. శనివారం రాత్రి కూడా ట్రంప్‌తో మాట్లాడినట్లు నెతన్యాహు తెలిపారు. సిరియాతో ఘర్షణ పడాలని తాము అనుకోవడం లేదని నెతన్యాహు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సిరియా నుండి ఎదురయ్యే ముప్పును భగ్నం చేయడానికే తాము చర్యలు తీసుకుంటున్నామని చెప్పుకున్నారు. మరోపక్క సిరియాలోని రెబెల్ గ్రూపు హయత్ తహ్రీర్ అల్ షామ్ (హెచ్‌టిఎస్) గ్రూపుతో దౌత్య సంబంధాలు నెలకొల్పినట్లు బ్రిటన్ విదేశాంగ మంత్రి ప్రకటించారు. హెచ్‌టిఎస్‌తో సంబంధాలు పెట్టుకున్నట్లు అమెరికా విదేశాంగ మంత్రి కూడా శనివారం ప్రకటించారు. అలాగే సిరియన్లకు 63 మిలియన్ల డాలర్ల (50మిలియన్ల పౌండ్లు) సాయాన్ని అందచేస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. దశాబ్ద కాలంగా సిరియాలో సాగిన అంతర్యుద్ధానికి ప్రజలు తీవ్రంగా బలయ్యారు. దేశ మౌలిక సదుపాయాల వ్యవస్థ కకావికలమైంది. పెద్ద సంఖ్యలో ప్రజలు నిర్వాసితులయ్యారు. చాలామంది దేశం విడిచి వెళ్ళిపోయారు. ఇటువంటి పరిస్థితుల్లో సిరియన్లకు ఎంతగానో అవసరమైన మానవతా సాయం కింద ఈ మొత్తాన్ని అందచేస్తున్నట్లు బ్రిటన్ ప్రకటించింది. ప్రజల ఆహారం, వసతి, అత్యవసర ఆరోగ్య సంరక్షణతో సహా 10లక్షల మందికి పైగా ప్రజలకు తక్షణ సాయంగా 30మిలియన్ల పౌండ్లు అందుతుందని తెలిపింది. మరో 10మిలియన్ల పౌండ్లు పొరుగుదేశాల్లోని సిరియన్లకు సాయంగా లెబనాన్‌లోని ప్రపంచ ఆహార కార్యక్రమానికి అందచేయనున్నారు. మరో 10మిలియన్ల పౌండ్లు జోర్డాన్‌కు అందనుంది. గోలన్ హైట్స్ సరిహద్దులను విస్తరించాలని ఇజ్రాయిల్ భావిస్తోందని టర్కీ విమర్శించింది. ఇందుకోసం ఆదివారం ఒక ప్రణాళికను ఆమోదించారని, దాని ప్రకారం గోలన్ హైట్స్ నగరాల్లోని జనాభాను రెట్టింపు చేయాలని భావిస్తున్నారని పేర్కొంది.

తరంగాలు
Tharangalu Daily News Paper

# రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌కు పట్టదు

(మొదటి తరువాయి)

పాటించడం లేదు. ఫ్లకార్డులు ప్రదర్శించడం, నినాదాలు చేయడం నిషేధం. అందుకు సంబంధించిన నిబంధనలను స్పీకర్ మధుసూదనాచారి నేతృత్వంలోనే రూపొందిం చారు. ఇప్పుడు ఇలా వ్యవహరించడం సరికాదు. రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌కు పట్టడం లేదు. నిరుద్యోగులకు ఉద్యోగాలు రావడం, ఆదాయం పెరగడం, అభివృద్ధి కావడం ఆ పార్టీకి ఇష్టం లేదు. రాష్ట్రం ఏమైనా పోయినా ఫరవాలేదు అన్నట్టుగా వ్యవహరిస్తున్నది.'అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం శాసనమండలిలో 'తెలంగాణ రాష్ట్రంలో పర్యాటక విధానం'అనే అంశంపై స్వల్పకాలిక చర్చను చేపట్టారు. మధ్యాహ్నం 3.20 గంటలకు సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు ఫ్లకార్డులు ప్రదర్శించారు. కొందరు సభ్యులు తాత మధు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, తక్కళ్లపల్లి రవీందర్‌రావు, శంభీపూర్‌రాజు, నవీన్‌రెడ్డి ఫ్లకార్డులతో చైర్మెన్ పోడియం వద్దకు వెళ్లి నిరసన చేపట్టారు. మిగిలిన సభ్యులు నిలబడి నిరసన వ్యక్తం చేశారు. 'రైతుకు బేడీలు సిగ్గు సిగ్గు, లగచర్ల రైతులపై కేసులు ఎత్తేయాలి, అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలి'అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి పలుమార్లు సభ్యులను వారి సీట్లలో కూర్చోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశం బీఏసీలో చర్చకు వచ్చిందనీ, మంగళవారం చర్చిద్దామని చెప్పారు. అయినా బీఆర్ఎస్ సభ్యులు వినకుండా నిరసనను కొనసాగించారు. నిరసన మధ్యలోనే భట్టి మాట్లాడారు. బీఆర్ఎస్ సభ్యులు సభా గౌరవాన్ని దెబ్బతీయడం దురదృష్టకరమని అన్నారు. సభ మర్యాదలను పాటించాలనీ, ఔన్నత్యాన్ని కాపాడాలని సూచిం చారు. రాష్ట్రాభివృద్ధి, సంస్కృతి, సంప్రదా యాల గురించి పట్టించుకోవాలని కోరారు. కానీ బీఆర్ఎస్ సభ్యుల తీరు అందుకు విరుద్ధంగా ఉందన్నారు. రాష్ట్రా భివృద్ధి జరగొద్దనీ, ఆదాయం సమకూరొద్దనీ, నిరుద్యో గులకు ఉపాధి అవకాశాలు రావొద్దన్నట్టుగా బీఆర్ఎస్ సభ్యులు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించకుండా, రూ.7.50 లక్షల కోట్ల అప్పులు చేసి ఇప్పుడు సభను అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. అనంతరం సభను మంగళవారం ఉదయం పది గంటలకు వాయిదా వేస్తున్నట్టు చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రకటించారు.

# కాంగ్రెస్- బీఆర్ఎస్ ఢీ అంటే ఢీ

(మొదటి తరువాయి)

అనుమతించాలని ప్రతిపక్షం పట్టుబట్టింది. బీఆర్ఎస్ నిరసనలు, నినాదాల మధ్య ప్రశ్నోత్తరాల అనంతరం పదే పది నిమిషాలు సభ నడిచింది. మధ్యాహ్నం 2.:30 గంటలకు ప్రారంమైన సభ, 2:40కే వాయిదా పడింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ పర్యాటక రంగంపై స్వల్పకాలిక చర్చకు అనుమతించగా ఆ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ గత పదేండ్లల్లో పర్యాటక రంగ అభివృద్ధికి సరైన విధానం రూపొందించలేదన్నారు. ఆదాయమే కాకుండా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు పెంచేలా కొత్త విధానాన్ని అమలుచేయనున్నామని ప్రకటించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని దిగజార్చింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని చెప్పారు. కేసీఆర్ ప్రభుత్వం అప్పుల కుప్పను, చిప్పను తెలంగాణ ప్రజల చేతికిచ్చిందని వ్యాఖ్యానించారు. వినోదంతోపాటు ఆదాయాన్ని పెంచే ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. అంతకుముందు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ పర్యాటక విధానంపై చర్చించాలని సభకు సూచించారు. సభ్యులు సభ సజావుగా నడవటానికి సహకరించాలని కోరారు. అనంతరం జూపల్లి మరింత వివరణ ఇచ్చే ప్రయత్నం చేయగా ప్రతిపక్ష బీఆర్ఎస్ సభ్యులు అడుగడుగునా అడ్డు తగిలారు. లగచర్లపై చర్చకు పట్టుబడుతూ నినాదాలతో హోరెత్తించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్ జోక్యం చేసుకుంటూ సభా మర్యాదను కాపాడాలని బీఆర్ఎస్ నేతలు కె.తారకరామారావు, టి. హరీశ్‌రావు, ప్రశాంత్ రెడ్డిని కోరారు. రూల్‌బుక్ అందరమూ కలిసే తయారుచేసుకున్న సంగతిని గుర్తు చేశారు.

## ఫ్లకార్డులు తేవడం సరికాదు :స్పీకర్ గడ్డం ప్రసాద్

సభకు ఫ్లకార్డులు తేవడం సరికాదనీ, నినాదాలు చేయడాన్ని తప్పుబట్టారు. అందరూ కూర్చోవాలని పదే పదే విజ్ఞప్తి చేశారు. కాగా బీఆర్ఎస్ సభ్యులు సీట్ల దగ్గర ఉండే నిరసన తెలుపుతుండగా, స్పీకర్ మార్షల్స్‌ను పిలిచారు. సభ్యుల దగ్గర ఉన్న ఫ్లకార్డులు తీసుకోవాలని ఆదేశించారు. మార్షల్స్ ఆ ప్రయత్నం చేస్తుండగానే బీఆర్ఎస్ సభ్యులు మార్షల్స్‌ను నెట్టుకుంటూ స్పీకర్ పోడియం దగ్గరకు చేరుకుని మళ్లీ నిరసనకు పూనుకున్నారు. స్పీకర్ పోడియంకు కుడివైపు హరీశ్‌రావు ఫ్లకార్డుతో వెళ్లగా, ఎడమవైపు కేటీఆర్ మిగతా సభ్యులతో ఆందోళనకు దిగారు. లగచర్ల రైతుకు బేడీలు వేయడం షేమ్ షేమ్ అన్నారు. రైతులకు కరెంటు షాకులు ఇస్తారా అంటూ ప్రశ్నించారు. ఇదేమీ రాజ్యం ఇదేమీ రాజ్యం..దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలు చేశారు. ఇది జరుగుతుండగానే, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి 2:40 గంటలకు సభలోకి అడుగుపెట్టారు. సభా పరిణామాలను గమనిస్తూ కూర్చున్నారు. ఒకవైపు నిరసన, మరోవైపు మంత్రి జూపల్లి ప్రసంగం నడుస్తుండగానే మధ్యలో స్పీకర్ జోక్యం చేసుకుని సభను మంగళవారం ఉదయం 10 గంటలకు వాయిదా వేశారు.

## మీడియా పాయింట్ వద్ద నిరసన

అసెంబ్లీ వాయిదా పడిన అనంతరం బీఆర్ఎస్ సభ్యులంతా నినాదాలు చేసుకుంటూ మీడియా పాయింట్ వద్దకు వచ్చారు. అప్పటికే కాంగ్రెస్ సభ్యులు మీడియాతో మాట్లాడుతుండటంతో కొద్దిసేపు ఆగాల్సి వచ్చింది. కేటీఆర్, హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు నినాదాలు చేస్తూ దాదాపు అరగంటపాటు నిరసన తెలిపారు. లాఠీ రాజ్యం, లూటీ రాజ్యం, దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం, రైతులకు బేడీలు.. మంత్రులకు జల్సాలు అంటూ నినాదాలు చేశారు. రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ లగచర్లలో భూములు ఇవ్వకపోతే జైల్లో పెడతారా ? అని ప్రశ్నించారు. ఈ ఘటనపై అసెంబ్లీలో చర్చ పెట్టకుండా రేవంత్‌రెడ్డి పారిపోయారని విమర్శించారు. అప్పులపై రాష్ట్ర ప్రభుత్వం సభనూ, ప్రజలనూ తప్పుదోవ పట్టిస్తున్నదని ఆరోపించారు. రైతులు ఇబ్బంది పడుతుంటే టూరిజంపై చర్చ అవసరమా ? అని అడిగారు. సీఎం ఢిల్లీ పర్యటనకు వెళు_న్నారు%౯ా%ఎక్కే విమానం, దిగే విమానం తప్ప ఒక్క పైసా తేలేదని వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యేల ప్రొటోకాల్ ఉల్లంఘనలపై స్పీకర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. అలాగే సభాహక్కుల కింద నోటీసు ఇచ్చినట్టు చెప్పారు.

# ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్న కాంగ్రెస్

(మొదటి తరువాయి)

అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ అప్పులు కేవలం రూ.3.89 లక్షల కోట్లు అని ఆర్బీఐ నివేదికలో స్పష్టం చేస్తే.. రాష్ట్ర ప్రభుత్వం మాత్రం రూ.7లక్షల కోట్లు అంటూ తప్పుదోవ పట్టిస్తుందని విమర్శించారు. రాష్ట్ర అప్పులపై ఆర్థిక మంత్రి ఉద్దేశపూర్వకంగానే తప్పుడు సమాచారమిచ్చి, గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగించారని అన్నారు. అందుకే తెలంగాణ శాసనసభ కార్య విధాన మరియు కార్యక్రమ నిర్వహణ నియమావళిలోని 168 (1) నిబంధన ప్రకారం బీఆర్ఎస్ శాసనసభా పక్షం తరపున ఆర్థిక మంత్రిపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు ఇస్తున్నామని చెప్పారు. ఎమ్మెల్యేల హక్కులకు భంగం కలిగించేలా వ్యవహరిస్తున్న అంశంలోనూ సభా హక్కుల నోటీసులు ఇచ్చామని తెలిపారు. లగచర్ల వంటి బాధాకరమైన సంఘటన జరిగినప్పుడు, టూరిజంపైన అసెంబ్లీలో చర్చ పెట్టడం ప్రభుత్వ ప్రాధాన్యతలకు అద్దం పడుతుందని కేటీఆర్ విమర్శించారు. లగచర్ల అంశంపై శాసనసభలో చర్చించాలని స్పీకర్‌కు విజ్ఞప్తి చేశామని తెలిపారు. అసలైన అప్పులతో రాష్ట్ర ప్రభుత్వం సవరణ స్టేట్‌మెంట్ ఇవ్వాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సవరణ ఇవ్వని పక్షంలో సభా హక్కుల ఉల్లంఘన తీర్మానాన్ని అసెంబ్లీలో ప్రవేశపెట్టాలని కోరారు. గతంలో తానే స్వయంగా అప్పటి ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డిపై ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌ను అప్పటి స్పీకర్ మనోహర్ అంగీకరించారని గుర్తుచేశారు. దానిపై అప్పుడు సభలో చర్చ జరిగిందని పేర్కొన్నారు. గతంలో ఉన్న పద్ధతులు, సాంప్రదాయాలకు అనుగుణంగా ప్రివిలేజ్ మోషన్ కు అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను విజ్ఞప్తి చేశామని తెలిపారు. గతంలో ఉన్నటువంటి సాంప్రదాయాలను పరిగణలోకి తీసుకుని సభా హక్కుల ఉల్లంఘన తీర్మానానికి స్పీకర్ గడ్డం ప్రసాద్ శాసనసభలో అనుమతి ఇస్తారని ఆశిస్తున్నానని అన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, ఇతర కాంగ్రెస్ నేతలు అప్పులపై బయట కూడా అడ్డగోలుగా మాట్లాడుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. 7 లక్షల కోట్ల అప్పు అంటూ లేని అప్పు గురించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీళ్లు చెబుతున్న అప్పుల లెక్కలు తప్పు కాబట్టి.. ఈ ప్రభుత్వం కడుతున్నామని చెబుతున్న నెలకు 6వేల 500 కోట్ల వడ్డీ లెక్కలు కూడా తప్పే అని స్పష్టం చేశారు. ఏడాదికి కేవలం రూ.22 వేల కోట్ల వడ్డీ మాత్రమే కడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉండగా కేవలం టూరిజంపైనే రాష్ట్ర ప్రభుత్వం చర్చకు స్వీకరించడం బాధాకరమని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో ఢిల్లీ టూరిజం, జైలు టూరిజం బాగా నడుస్తున్నాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఢిల్లీకి 100కి పైగా చేసిన పర్యటనలతో ఢిల్లీ టూరిజం బాగా పెరిగిందని విమర్శించారు. మరోవైపు 40 మంది లగచర్ల రైతులను జైలులో పెట్టడం, ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడుతున్న సోషల్ మీడియా కార్యకర్తల నుంచి మొదలుకొని పార్టీ నాయకులను జైల్లో పెడుతున్న జైలు టూరిజం.. బెయిల్ వచ్చిన తర్వాత కూడా నటులను జైలులో ఉంచుతున్న జైలు టూరిజం.. ప్రభుత్వ పథకాలపై మాట్లాడుతుంటే జైలుకు పంపిస్తామని ముఖ్యమంత్రి చేస్తున్న జైలు టూరిజం.. ఈ విధంగా తెలంగాణలో జైలు టూరిజం బాగా నడుస్తుందని అన్నారు. సర్పంచ్‌ల సమస్యలపై కూడా శాసన సభలో చర్చకు లేవనెత్తామని కేటీఆర్ తెలిపారు. సర్పంచ్‌లకు ఇవ్వాల్సిన రూ.600 కోట్ల పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ తరఫున డిమాండ్ చేశామన్నారు.

# పరస్పర సహకారంతో ముందడుగు

(మొదటి తరువాయి)

భూ జల అధ్యయనంపై ఇరు దేశాలు పరస్పరం సహకరించుకోవాలని నిర్ణయించుకున్నట్టు పేర్కొన్నారు. ప్రాంతీయ శాంతి, భద్రత, అభివృద్ధికి కొలంబో సెక్యూరిటీ కాన్‌క్లేవ్ ఓ ముఖ్యమైన వేదికగా ఇరుదేశాలు భావిస్తున్నాయని శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకెతో కలిసి చేసిన సంయుక్త ప్రకటనలో ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఇరు దేశాల ప్రజల మధ్య సంబంధాలు మన నాగరికతతో ముడిపడి ఉన్నాయని అన్నారు. భారత్‌లో పాలీ భాషకు క్లాసికల్ లాంగ్వేజ్ హోదా ఇచ్చినపుడు, శ్రీలంకలో కూడా వేడుకలు జరుపుకున్నారని అన్నారు. శ్రీలంక అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం తన తొలి విదేశీ పర్యటన కోసం భారత్‌ను ఎంచుకున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. రెండు దేశాలు భవిష్యత్ దృక్పథాన్ని అనుసరించాయని ప్రధాని ప్రకటించారు. ఆర్థిక సహకారంలో భాగంగా పెట్టుబడి ఆధారితవృద్ధి, కనెక్టివిటీకి ప్రాధాన్యతనిచ్చామని అన్నారు. డిజిటల్, భౌతిక మరియు ఇంధన కనెక్టివిటీ తమ భాగస్వామ్యానికి ముఖ్యమైన మూలస్తంభాలుగా ఉంటాయని తాము నిర్ణయించుకున్నామని అన్నారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకె ఆదివారం న్యూఢిల్లీ చేరుకున్న సంగతి తెలిసిందే. సోమవారం ఆయన ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్రమంత్రులు నిర్మలా సీతారామన్‌తో పాటు పలువురితో సమావేశమయ్యారు.

# జై శ్రీరామ్ నినాదం నేరమెలా అవుతుంది?

(మొదటి తరువాయి)

కొట్టివేయడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. 'వారు ఒక మతానికి సంబంధించిన పదాలను లేదా పేర్లను గట్టిగా అరిచారు. అది నేరమెలా అవుతుంది?' అని జస్టిస్ పంకజ్ మిథాల్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన బెంచ్ ప్రశ్నించింది. ఫిర్యాదీదారుడు హైదర్ అలీ వేసిన పిటిషన్‌పై బెంచ్ విచారణ జరిపింది. ఈ నినాదాలు చేసిన వారిని ఎలా గుర్తు పట్టారని ఫిర్యాదీదారుని కోర్టు ప్రశ్నించింది. వారందరూ సిసిటివి నిఘాలో వున్నారని మీరు చెబుతున్నారు. లోపలకు వచ్చిన ఆ వ్యక్తులను ఎవరు గుర్తు పట్టారని ప్రశ్నించింది. ఈ కేసులో ఇద్దరు వ్యక్తులపై చేపట్టిన క్రిమినల్ ప్రొసీడింగ్స్‌ను కొట్టివేస్తూ సెప్టెంబరు 13న హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. వాటిని సవాలు చేస్తూ హైదర్ అలీ పిటిషన్ దాఖలు చేశారు. ఈ కేసులో దర్యాప్తు ఇంకా పూర్తి కాకుండానే హైకోర్టు కేసు కొట్టివేసిందని అలీ తరపున సీనియర్ న్యాయవాది దేవదత్ కామత్ తెలిపారు. ఫిర్యాదును ప్రస్తావిస్తూ కామత్, ఎఫ్ఐఆర్ అనేది నేరాల ఎన్‌సైక్లోపీడియా కాదని వ్యాఖ్యానించారు. మసీదులోకి ప్రవేశించిన వ్యక్తులను ఎలా గుర్తు పట్టారని బెంచ్ ప్రశ్నించగా రాష్ట్ర పోలీసులు దాన్ని వివరిస్తారని కామత్ చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వానికి కూడా పిటిషన్ కాపీని అందచేయాలని బెంచ్ పిటిషనర్‌ను కోరింది. జనవరికి ఈ విషయాన్ని వాయిదా వేసింది. ఎవరైనా జై శ్రీరామ్ అని కేకలు వేస్తే అది ఏ వర్గానికి చెందినవారి మత భావాలనైనా ఎలా ప్రేరేపిస్తుందో అర్థం కావడం లేదని హైకోర్టు తన ఉత్తర్వుల్లో వ్యాఖ్యలు చేసింది. ఈ సంఘటన వల్ల ప్రజల్లో అపోహలు గానీ, ఘర్షణలు గానీ తలెత్తలేదని పేర్కొంది. ఫిర్యాదు చేసిన వ్యక్తికి కూడా ఆ కేకలు వేసింది ఎవరో తెలియలేదని పేర్కొంది.

# గ్రేటర్ గజ గజ

(మొదటి తరువాయి)

హకీంపేటలో 11.6 డిగ్రీలు, దుండిగల్‌లో 11.9 డిగ్రీలు, గాలిలో తేమ 33 శాతంగా నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయి కంటే తక్కువకు పడిపోతుండడంతో రానున్న రోజుల్లో చలి తీవ్రత మరింత పెరిగే అవకాశాలున్నట్లు అధికారులు వెల్లడించారు.

# ఫార్ములా వన్ కేసుపై గవర్నర్ గ్రీన్ సిగల్

(మొదటి తరువాయి)

పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఆ మేరకు గవర్నర్ జారీ చేసిన దస్త్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతి త్వరలోనే, ఇంకా చెప్పాలంటే మంగళవారమే ఏసీబీకి పంపిస్తారని ఆయన వివరించారు. ఈ కేసుకు సంబంధించి చట్ట ప్రకారమే ఏసీబీ తన దర్యాప్తును కొనసాగిస్తుందని వ్యాఖ్యానించారు. సోమవారం అసెంబ్లీ వాయిదా అనంతరం పొంగులేటి మీడియా ప్రతినిధులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఫార్ములా వన్ కేసుకు సంబంధించి రాష్ట్ర మంత్రివర్గంలో చర్చించామని అన్నారు. కేటీఆర్ అరెస్టు గురించి తానేమీ చెప్పలేననీ, ఈ విషయంలో చట్టం తన పని తాను చేసుకుపోతుందని అన్నారు. అరెస్టులకు సంబంధించి తాను పేల్చిన బాంబు తుస్సుమందంటూ బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్నారనీ, అలాంటప్పుడు వారు ఢిల్లీ చుట్టూ ఎందుకు చక్కర్లు కొట్టారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీలో మాట్లాడేందుకు ఏమీ లేనందువల్లే ఆ పార్టీ ఎమ్మెల్యేలు గుండాల్లా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# మార్చి 5 నుంచి ఇంటర్ పరీక్షలు

(మొదటి తరువాయి)

సంవత్సరం పరీక్షలు మార్చి ఐదు నుంచి 24 వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి ఆరు నుంచి 25 వరకు జరుగుతాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి కృష్ణ ఆదిత్య సోమవారం పరీక్షల షెడ్యూల్ (టైంటేబుల్)ను విడుదల చేశారు. మార్చి ఐదు నుంచి 25 వరకు జరిగే పరీక్షలను ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చేఏడాది ఫిబ్రవరి మూడు నుంచి 22 వరకు ఇంటర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలుంటాయని వివరించారు. ప్రతి రోజూ రెండువిడతల్లో ఈ పరీక్షలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి విడత, మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు రెండో విడత ప్రాక్టికల్ పరీక్షలుంటాయని తెలిపారు. గత విద్యాసంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలను ప్రభుత్వం ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. వారు ప్రస్తుత విద్యాసంవత్సరంలో ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. జనవరి 31న ఇంటర్ ప్రథమ సంవత్సరం, ఫిబ్రవరి ఒకటిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహిస్తామని ఆయన తెలిపారు. జనవరి 29న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నైతికత, మానవ విలువలు రాతపరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. అదేనెల 30న ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పర్యావరణ విద్య పరీక్షను నిర్వహిస్తామని వివరించారు.

# 21వరకే అసెంబ్లీ!

(మొదటి తరువాయి)

కమిటీ (బీఏసీ) సమావేశం నిర్వహించారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, మంత్రి పొన్నం ప్రభాకర్, బీఆర్ఎస్ నేత తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి, బీజేపీపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం నేత అక్బరుద్దీన్, సీపీఐ సభ్యులు కూనంనేని సాంబశివరావు తదితరులు హాజరయ్యారు. 15 రోజులపాటు అసెంబ్లీ సమావేశాలను నిర్వహించాలంటూ బీఆర్ఎస్, బీజేపీ పట్టుబట్టాయి. ప్రభుత్వం మాత్రం శుక్రవారం వరకే సమావేశాలు జరుగుతాయని చెప్పినట్టు తెలిసింది. దీంతో బీఏసీ సమావేశం నుంచి బీఆర్ఎస్, ఎంఐఎం పార్టీలు వాకౌట్ చేశాయి. సభా పని దినాలు, సబ్జెక్ట్‌పై క్లారిటీ ఇవ్వనందుకు వాకౌట్ చేసినట్టు బీఆర్ఎస్ ప్రకటించింది. టీ షర్ట్స్ వేసుకుని వస్తే తప్పేంటని బీఆర్ఎస్ సభ్యులు ప్రశ్నించారు. పార్లమెంట్‌కు రాహుల్ గాంధీ టీషర్ట్ వేసుకుని వెళ్లడం లేదా అని సమావేశంలో హరీశ్‌రావు ప్రశ్నించారు. బీఏసీ సమావేశంపై మాజీ మంత్రి హరీశ్‌రావు తీవ్ర అసంతప్తి వ్యక్తం చేశారు. మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడుతూ.. గంటసేపు సమావేశం జరిగినా సభ పనిదినాలపై స్పష్టత ఇవ్వడం లేదని అన్నారు. అందుకే బీఏసీ నుంచి వాకౌట్ చేసినట్టు తెలిపారు.

## క్రీడాకారులకు హాకీ స్టిక్స్ పంపిణీ చేసిన నూతన వధూవరులు



**కేసముద్రం, డిసెంబర్ 16, (తరంగాలు)**
కేసముద్రం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ కు చెందిన హాకీ క్రీడాకారులకు నూతన వధూవరులైన పెండ్లి సాయి సాకేత్,కీర్తన లు రూ.8 వేల విలువైన హాకీ స్టిక్స్ బహుకరించి పలువురికి ఆదర్శంగా నిలిచారు.వివరాలలోకి వెళితే.. కేసముద్రం స్టేషన్ కు చెందిన రావుల పరమేశ్వర్ (చిన్ని),నర్మద దంపతుల కుమార్తె కీర్తన వివాహం మహబూబాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన పెండ్లి అశోక్,అనిత దంపతుల కుమారుడు సాయి సాకేత్ తో ఈనెల 14వ తేదీన జరిగింది.వివాహం పురస్కరించుకొని నూతన వధూవరులు తమకు క్రీడలపై ఉన్న మక్కువతో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సోమవారం క్రీడాకారులకు హాకీ స్టిక్స్ అందజేశారు.ఈ సందర్భంగా పెండ్లి అశోక్ మాట్లాడుతూ... క్రీడాకారులు విద్యతో పాటు క్రీడలలో రాణించాలని,లక్ష్యాన్ని సాధించి తల్లిదండ్రుల కలలు సాకారం చేయాలని అన్నారు.ఈ సందర్భంగా నూతన వధూవరులను కేసముద్రం స్టేషన్ జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బందెల రాజు,పాఠశాల పిడి కొమ్ము రాజేందర్ తోపాటు పలువురు అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా బ్యాడ్మింటన్ అసోసి యేషన్ జాయింట్ సెక్రటరీ రావుల మురళి,రావుల రమేష్,నాగనబోయిన వెంకటేశ్వర్లు,ముత్యాల శివకుమార్,తోట మధుసూదన్,తేరాల శ్యాం కుమార్,రావుల గంగాధర్,అల్లం సురేష్, షేక్ సర్దర్ అలీ తోపాటు పలువురు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆత్మీయ మిత్రుల అపూర్వ సమ్మేళనం

**-20 ఏళ్ళ తర్వాత ఆత్మీయ కలయిక**



**సంగారెడ్డి డిసెంబర్16( తరంగాలు)**
అందోల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల – ఆందోలు 2004బి05 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం మండల పరిధిలోని పోతిరెడ్డిపల్లి శివారులోని ఓ వ్యవసాయ క్షేత్రంలో ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి పూర్వ విద్యార్థులందరూ పాల్గొని ఒకరిని ఒకరు కలుసుకుని అలింగనం చేసుకుంటూ పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గత ఇరవై ఏళ్లలో మృతి చెందిన నలుగురు పూర్వ విద్యార్థులను స్మరించుకుంటూ వారి ఆత్మకు శాంతి చేకూరాలని రెండు నిమిషాల పాటు మౌనం పాటించి వారికి నివాళు లార్పించారు.ఈ కార్యక్రమానికి సభ అధ్యతన పూర్వ విద్యార్థి సీనియర్ జర్నలిస్ట్ సుగ్రీవుడు ముదిరాజ్ వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులందరు కలిసి ఎవరికి ఏ ఆపద వచ్చిన వారికి ఎల్లప్పుడు ఆదుకునేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నిరుపేద కుటంబంలో జన్మించి చదువుకోలేని స్థోమత ఉన్న విద్యార్థులను కూడా తాము చేరదీసి వారికి విద్యాబ్యాసం చేయించడంతో పాటు వారిని ఆర్థికంగా ఆదుకుంటామని ఈ సందర్భంగా ప్రకటించారు..ఈ కార్యక్రమంలో సాయిబాబా,పడిగల శివ , శేఖర్, అనిల్, గంగారాం, నాగరాజు, నరేందర్, సత్యనారాయణ, విజేందర్, శంకర్ గౌడ్, ఇమామ్ అలీ, సాయి, యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ నగర్‌లో ఫాతిమా సొసైటీ అన్నదాన కార్యక్రమం



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 16,(తరంగాలు):**
శ్రీనివాస్ నగర్‌లో ఫాతిమా ఎన్విరాన్మెంట్ డెవలప్మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షుడు మొహమ్మద్ పర్వేజ్ పూర్తి బాధ్యతను తీసుకుని, తోటి కార్మికులతో కలిసి ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సహకరించిన రాజు, గోపాలకృష్ణ, యూసుఫ్, వాజిద్, వినోద్, వీటి పాలెం, జావీద్ ఫ్రూట్, జహంగీర్ లాల్, మొహమ్మద్ హుసేన్, ఆరిఫ్, ఆశు, సైదులు, అజీమ్ తదితర ఆటో డ్రైవర్లు మరియు మెకానిక్‌లు కీలక పాత్ర పోషించారు.ఈ సేవా కార్యక్రమంలో పాల్గొన్నవారికి పర్వేజ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అల్లా ప్రతి ఒక్కరికీ మేలుచేసే శక్తి ప్రసాదించాలని ఆయన ప్రార్థించారు. సేవలోనే సంతృప్తి, అన్న సందేశంతో భవిష్యత్‌లో ఇలాంటి కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలియజేశారు.

# ప్రతి ఒక్కరూ సేవా భావం పెంపొందించుకోవాలి

**-జిల్లా విద్యాశాఖ అధికారి డాక్టర్ ఏ.రవీందర్ రెడ్డి**

**-మాధవ పెద్ది అనసూయ జ్ఞాపకార్థం 10వ,తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్ పంపిణీ**




**కేసముద్రం,డిసెంబర్ 16, (తరంగాలు)**
ప్రతి ఒక్కరూ సేవా భావం పెంపొందించుకోవాలని మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ అధికారి అంద్రు రవీందర్ రెడ్డి అన్నారు. సోమవారం మాధవ పెద్ది గోపాల్ రెడ్డి దివంగత మాధవ పెద్ది అనసూయ శేషారెడ్డి జ్ఞాపకార్థం పెనుగొండ జడ్పీ హైస్కూల్ లోని10వ,తరగతి విద్యార్థులకు రూ.15 వేల విలువైన ఆల్ ఇన్ వన్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డిఈఓ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ...అభ్యసన సామర్థ్యాలు నేర్చుకోవడం లో వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక శ్రద్ధ చూపుతూ పదవ తరగతి విద్యార్థులు అందరూ ఉత్తీర్ణత సాధించేలా ప్రయత్నించాలన్నారు.రానున్న పదవ తరగతి వార్షిక ఫలితాలలో మానుకోట జిల్లాను అగ్రభాగాన నిలపాలని కోరారు.అదేవిధంగా ఉపాధ్యాయులు నిర్వహించే చాప్టర్ వైస్ పరీక్షలకు ప్రతి విద్యార్థి తప్పనిసరిగా హాజరుకావాలని,విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెంపొందించుకొని 10వ,తరగతి వార్షిక ఫలితాలలో అగ్రశ్రేణి ఫలితాలు సాధించాలని డిఇఓ రవీందర్ రెడ్డి విద్యార్థులకు సూచించారు.ఈ సందర్భంగా పెనుగొండ జడ్పీ హైస్కూల్ హెచ్ఎం,మండల విద్యాశాఖ అధికారి కాలేరు యాదగిరి మాట్లాడుతూ..పెనుగొండ జడ్పీ హైస్కూల్లోని పదవ తరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేసిన మాధవ పెద్ది గోపాల్ రెడ్డి అభినందనీయులని అన్నారు.విద్యార్థులు ఆల్ ఇన్ వన్ మెటీరియల్ ను సద్వినియోగం చేసుకొని,ఉత్తమ ఫలితాలు సాధించి పాఠశాలకు, తల్లిదండ్రులకు చక్కని పేరు తేవాలని ఎంఈఓ కాలేరు యాదగిరి విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఏసీజీ మందుల శ్రీరాములు,దాత మాధవపెద్ది గోపాలరెడ్డి,విద్యా కమిటీ చైర్మన్ షమినా బేగం, స్ఫూర్తి ఫౌండేషన్ అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి,కార్యదర్శి కృష్ణయ్య, గ్రామస్థులు ఉపేందర్ రెడ్డి,వీరస్వామి, పాఠశాల ఉపాధ్యాయులు అంజయ్య, గురునాథ రావు, హుస్సేన్,భీముడు,వెంకటగిరి ,భాస్కర్, సత్యం రవికుమార్, శ్రీనివాస రావు,మల్లేశం, వీరేందర్,భాగ్యలక్ష్మి,విజయ్ చందర్ పాల్గొన్నారు.

# ఎంసిపిఐ(యూ) ఏఐసిటీయూ నాయకుల ఆందోళన





**-సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం**

**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 16,(తరంగాలు):**
మిర్యాలగూడ ఎంసిపిఐ(యూ) ఏఐసిటీయూ రాష్ట్ర కమిటీల పిలుపుమేరకు మిర్యాలగూడ సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యూ) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వస్కుల మట్టయ్య, ఏఐసిటీయూ జిల్లా కార్యదర్శి ధిరవత్ మోహన్ నాయక్, ఎంసిపిఐ(యూ) జిల్లా కార్యదర్శి వస్కుల సైదమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి పోతుగంటి కాశి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ కార్పొరేట్ శక్తులకు తలవంచిందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలను ప్రైవేటీకరిస్తూ, కార్మికుల సంఖ్యను తగ్గించుతూ లక్షలాది కార్మికులను అసంఘటిత రంగంలోకి నెట్టివేస్తున్నారని చెప్పారు. తదనంతరం వారు అన్నారు, 44 కార్మిక చట్టాలను నాలుగు కోడలుగా మార్చి పెట్టుబడిదారులకు మేలు చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమైంది. తెలంగాణలో కూడా ప్రభుత్వ రంగ పరిశ్రమలు లేనందున అసంఘటిత కార్మికుల సంక్షేమం తీవ్రంగా ప్రభావితమవుతోంది. సమాన పనికి సమాన వేతనం అందించడంతో పాటు అసంఘటిత కార్మికుల కోసం సమగ్ర కార్మిక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి.ఈ కార్యక్రమంలో ఎంసిపిఐ(యూ) ఏఐసిటీయూ జిల్లా నాయకులు కిరణ్, భరత్, వీరయ్య, రవీందర్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

# కలష మండల పూజ వేడుకలకు



**-ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరు**



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్16,(తరంగాలు):**
మిర్యాలగూడ పట్టణంలోని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం నందు సోమవారం జరిగిన కలష మండల పూజ ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) హాజరై, స్వామి భక్తులతో కలిసి కలషం ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, అయ్యప్ప స్వామి భక్తుల ఐక్యత, ఆచారాలు, సంప్రదాయాలు మన సమాజంలో ప్రత్యేక గుర్తింపు తెస్తాయని ప్రశంసించారు. ఈ వేడుకల ద్వారా భక్తులు ఆధ్యాత్మిక శాంతిని పొందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో 25వ వార్డు కౌన్సిలర్ దేశిడి శేఖర్ రెడ్డి, ఇన్చార్జి గోదాల జానకిరామ్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ ముక్కపాటి వెంకటేశ్వరరావు, గుడిపాటి నవీన్, గుడిపాటి హరీష్, మిత్ర నవీన్, దప్పు శ్రీనివాస్, కిషోర్ రెడ్డి, తాళ్ల వెంకట్ రెడ్డి, శివ శ్రీనివాస్ తదితర నాయకులు, అయ్యప్ప స్వాములు, భక్తులు, కాంగ్రెస్ నాయకులు మరియు బిఎల్ఆర్ బ్రదర్స్ పాల్గొన్నారు .ఈ ఉత్సవం భక్తుల మన్ననలు పొందుతూ భక్తి పరవశంలో విజయవంతంగా ముగిసింది.

## కదిరే యశోదకు నివాళులర్పించిన ఏయంసి చైర్మన్ గంట సంజీవరెడ్డి

**కేసముద్రం,డిసెంబర్ 16, (తరంగాలు)**
కేసముద్రం మండలం అన్నారం గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ కదిరే ప్రకాష్ తల్లి కదిరి యశోద మృతిచెందగా భౌతిక కాయానికి కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి,కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అల్లం నాగేశ్వర్ రావు పూలమాలవేసి నివాళులు అర్పించారు. వారితోపాటు బండారు దయాకర్,మాజీ ఎంపీపీ కదిరే సురేందర్,గండి శ్రీనివాస్,శేఖర్ రెడ్డి,తదితరులు ఉన్నారు.



# తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా సంగినేని భీమరాజు






**వర్ధన్నపేట ప్రతినిధి ,16డిసెంబర్,తరంగాలు**
తెలంగాణ ముదిరాజ్ మహాసభ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడిగా సంగినేని భీమరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.సోమవారం వర్ధన్నపేట ఇల్లంద గ్రామంలోని ముదిరాజ్ ఇలవెల్పైన శ్రీ పెద్దమ్మ తల్లి,రేణుక ఎల్లమ్మ తల్లి ఆలయాల ప్రాంగణంలో రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి పల్లెబోయిన అశోక్ ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షుడు బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజినీ కాంత్ చేతుల మీదుగా ఇల్లంద గ్రామానికి చెందిన సంఘినేని భీమ్ రాజ్ ముదిరాజ్ ను జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించి, కుల సభ్యుల సమక్షంలో నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ముదిరాజుల సంక్షేమం కోసం, వారి అభివృద్ధికై పాటుపడుతానని తెలిపారు. అనంతరం భీమరాజు మాట్లాడుతూ ముదిరాజుల హక్కుల కొరకు,అన్ని వర్గాలను కలుకుని ముందుకు సాగుతానని,అందుకు నా శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.నా మీద నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన నాయకులకు, కులభందువులకు కుతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్, కార్యదర్శి పల్లెబోయిన అశోక్, అర్బన్ జిల్లా అధ్యక్షుడు బయ్య స్వామి, ప్రధాన కార్యదర్శి పులి రజినీకాంత్, వరంగల్ జిల్లా చీఫ్ ప్రమోటర్ చొప్పరీ సోమయ్య, రూరల్ అధ్యక్షుడు పొన్నం మొగిలి, వరంగల్ యువ అధ్యక్షుడు అమర్ చంద్, ఎన్ ఆర్ ఐ అధ్యక్షుడు రాజ్కుమార్, వరంగల్ జిల్లా కార్యదర్శి నీరతి సదానందం, అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులు బిళ్ళ శివ శంకర్, కుల పెద్దలు సుంకరి సాంబయ్య, పిట్టల భాస్కర్, పిట్టల కుమారస్వామి, కొండ ఉప్పాలయ్య, మత్స్యశాఖ అధ్యక్షులు సుంకరి స్వామి, ఉపాధ్యక్షులు మాట్టేపెల్లి సుభాష్, డైరేకర్లు సుంకరి భిక్షపతి, బొల్లా సదానందం, కుల సభ్యులు అంబటి ఎల్లాస్వామి, కొండ సందీప్, అన్నెబోయిన రాజు, ముద్రబోయిన సంబరాజు, సంఘినేని సుధాకర్, సుంకరి బాబు, బస్స వెంకటనరసు, కుమ్మం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ కేసులపై నిరసన బి ఆర్ ఎస్ ర్యాలీ

**-మిర్యాలగూడ నియోజకవర్గ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి**



**మిర్యాలగూడ ఆర్సీ, డిసెంబర్ 16, (తరంగాలు):**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు, మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే & బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టి, వారిపైన థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్లలో నిర్బంధించి, రైతన్నల చేతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా. రైతన్నలపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి, వారిని వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ.17.12.2024 (మంగళవారం) ఉదయం 10 గంటలకు రెడ్డికాలనిలో గల బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా వెళ్లి, రైతు బజార్ దగ్గర గల డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించి నిరసన తెలిపే కార్యక్రమం నిర్వహించనున్నారు.కావున మిర్యాలగూడ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ పట్టణ, మండల విభాగాల అధ్యక్షులు, కార్యదర్శులు, ప్రజలు పెద్ద సంఖ్యలో ఉదయం 10 గంటలకు రెడ్డి కాలనీ లో గల బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ కు రాగలరు.

# నామినేటెడ్ పదవి బీసీ నాయకునికి ఇవ్వాలి


**-బీసీ బహుజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్ కుమార్**



**వరంగల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 16,(తరంగాలు)**
నగరంలోని 14వ డివిజన్ ఎన్టీఆర్ నగర్ గ్రామానికి చెందిన అడుప మహేష్ కు బీసీ లో భాగంగా నామినేటెడ్ పదవుల్లో భాగంగా బీసీ నాయకుడైన అడుప మహేష్ కు వరంగల్ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఇవ్వాలని తెలంగాణ బీసీ బహుజన రాష్ట్ర అధ్యక్షుడు ప్రతాపగిరి విజయ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 25 సంవత్సరాలు నుండి కాంగ్రెస్ పార్టీలో కష్టకాలంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ పార్టీ కోసం తన కుటుంబ పనుల సైతం పక్కన పెట్టి పార్టీ నే కన్నతల్లి అని ఎన్నో సామాజిక సేవ కార్యక్రమాలు చేశారు. రాష్ట్ర జిల్లా పార్టీ చేపట్టిన అనేక కార్యక్రమాలలో పాల్గొంటు అలాగే ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ అన్ని వర్గాల ప్రజల స్థానిక సమస్యలను తెలుసుకొని తనకు వీలైనంత వరకు కృషి చేస్తున్న అడుప మహేష్ కు బడుగు బలహీన వర్గాల నాయకులు గౌరవ నీయులు వర్ధన్నపేట శాసనసభ్యులు కె ఆర్ నాగరాజు జిల్లా నామినేటెడ్ పదవుల్లో భాగంగా బీసీ నాయకుడు మహేష్ కు నామినేటెడ్ పదవిలో అవకాశం కల్పించాలని బీసీ సంఘం నుండి కోరడం జరిగింది.

# కమిషన్లకు కేరాఫ్ గా కాంగ్రెస్ ప్రభుత్వం...

**-కప్పం కడితేనే బిల్లు విడుదల....**
**-ప్రభుత్వ మార్పుతో కుంటుపడిన అభివృద్ధి...**
**-మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి**



**నర్సంపేట డిసెంబర్ 16 తరంగాలు:**
రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కమిషన్లకు కేరాఫ్ అడ్రస్ గా మారిపోయిందని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. సోమవారం నర్సంపేట పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది మాట్లాడుతూ రాష్ట్రంలో కాంట్రాక్టర్లు పనులు చేపట్టాలంటేనే బెంబేలెత్తి పోతున్నారని అన్నారు. సంవత్సరం క్రితం చేసిన పనులకు బిల్లులు ఇవ్వకుండా కేవలం అధికార పార్టీ ఏజెన్సీలకు మాత్రమే రెండు నెలల్లోనే బిల్లులు ఇవ్వడం వెనుక మతలబు ఏంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికార పార్టీ నాయకులు 10 శాతం కమిషన్లు దండుకొని బిల్లులు విడుదల చేయడం దారుణం అన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క సోమవారం అసెంబ్లీలో రోడ్ల నిర్మాణాలపై చేసిన ప్రకటనను పెద్ది ఖండించారు. కొత్తగా రోడ్ల నిర్మాణం చేయడానికి నిధులను విడుదల చేశామని ప్రతి గ్రామపంచాయతీ తో పాటు స్వచ్ఛభారత్ గ్రామాలు, తండాలలో కొత్తగా రోడ్ల నిర్మాణం చేస్తున్నామని మంత్రి సీతక్క తప్పుడు ప్రకటన చేశారన్నారు. జిల్లా మంత్రిగా ఉండి ఇప్పటివరకు కనీసం అభివృద్ధి పనులపై నర్సంపేట నియోజకవర్గంలో సమీక్ష నిర్వహించకపోవడం శోచనీయమన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన వందల కోట్ల రూపాయల నిధులను రద్దు చేయడం, దాటవేయడం, కక్షపూరితంగా వ్యవహరించడం మీకు కనబడడం లేదా అని మంత్రి సీతక్కను ప్రశ్నించారు. నర్సంపేట నియోజకవర్గం లో తండాలకు గ్రామాలకు పల్లెలకు గతంలో ఇచ్చిన బిటి, సీసీ రోడ్లతో పాటు మహిళా సంఘాల భవనాలు అనేక రకాల అభివృద్ధి పనులకు గత ముఖ్యమంత్రి కేసీఆర్ నిధులు మంజూరు చేశారని ప్రస్తుత ప్రజా ప్రతినిధులు కక్షపూరితంగా ఆ నిధులను రద్దుచేసి రాక్షసానందం పొందుతున్నారని మండిపడ్డారు. ప్రభుత్వానికి కమిషన్ల మీద ఉన్న శ్రద్ధ ఎన్నికల హామీల అమలులో చూపించడం లేదన్నారు. నియోజకవర్గానికి అనేక రాష్ట్రస్థాయి ఇన్స్టిట్యూషన్స్ విద్యాసంస్థలు రీసెర్చ్ సెంటర్లు మంజూరు చేసి నిధులు కేటాయించిన ఇప్పటివరకు పనులు ప్రారంభం కాకపోవడం దారుణం అన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ మార్పు వల్ల అభివృద్ధి కుంటుపడిపోయిందని నర్సంపేట నియోజకవర్గానికి నిధులు అడిగే వారు ఎవరూ లేరని ఉన్న నిధులు రద్దు అయ్యాయని ఉన్న వ్యవస్థ మొత్తం ఆగిపోయిందని ఇకనైనా నర్సంపేట నియోజకవర్గ అభివృద్ధిపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించి పనులు చేపట్టాలని కోరారు.

## రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీలపై అనుచిత వాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్య తీసుకోవాలి...


**-మహిళ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ ..**




**తరంగాలు న్యూస్ డిసెంబర్ 16**
కాంగ్రెస్ పార్టి అగ్ర నాయకులు రాహుల్ గాంధీ,ప్రియాంక గాంధీ లపై నర్సంపేట మండలం గురిజాల గ్రామానికి చెందిన జయహో గురిజాల వాట్సాప్ గ్రూపులో అనుచిత వాఖ్యలు చేసిన పొదిల కుమారస్వామి అనే వ్యక్తిపై చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని, వరంగల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ అన్నారు. రాహుల్ గాంధీ మరియు ప్రియాంక గాంధీలు అన్న చెల్లెలు అన్న విషయం మరిచిపోయి వాళ్ళ మధ్య రహస్య రాసలీలలు అంటూ గురిజాల గ్రామంలోనీ జయహో గురిజాల గ్రూపులో అసభ్యకరమైన పోస్టులు పెడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్న పొదిల కుమారస్వామి అనే వ్యక్తిపై వెంటనే కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని స్థానిక చెన్నారవుపేట పోలీస్ స్టేషన్ లో కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె ఎస్ ఐ రాజేష్ రెడ్డి కి పిర్యాదు చేసారు. పిర్యాదు చేసిన వారిలో మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ సర్పంచ్ తప్పేట రమేష్, మహిళ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తూటి పావని, రమేష్, మండల నాయకులు బొంత శ్రీను, భూక్య సురేష్ , సాంబ లక్ష్మీ, జీవన్, పాల్గొన్నారు...

# ఐలోని మల్లన్న ఆలయంలో దృష్టి కుంభం





**ఐనవోలు,16డిసెంబర్,తరంగాలు:**
ఐనవోలు శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో 2025 జాతర ఉత్సవాలకు ముందుగా శ్రీ స్వామివారికి ప్రతి సంవత్సరం మాదిరిగా ఈ సంవత్సరం కూడా సుధావలి వర్ణ లేపనం (రంగులు అద్దడం) కార్యక్రమం ఈనెల 10నుండి 15 వరకు నిర్వహించడం జరిగిందని అదేవిదంగా సోమవారం స్వామి వారికి దృష్టి కుంభంతో దృష్టి తీయడం జరిగిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి అద్దంకి నాగేశ్వర్ రావు తెలిపారు.ఉదయం 4:00గం.ల నుండి పూజా కార్యక్రమాలు మొదలుపెట్టి శ్రీ స్వామివారి ఎదురుగా సుమారు మూడు క్వింటాల అన్నం వండి,స్వామివారి ఎదురుగా రాసిగా పోసి, వరి గడ్డితో అగ్ని చేసి,మేక పిల్లను ఎదురుగా ఉంచి మొదటగా స్వామివారి దృష్టి పడేటట్లుగా ఉంచి స్వామివారి దృష్టి కుంభం కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు.తదుపరి స్వామివారి నిజరూప దర్శనం భక్తులకు కల్పించినట్లు పేర్కొన్నారు.మాస సంక్రమణ సందర్భంగా గణపతి పూజ పుణ్యాహవాచనం స్వామివారికి మహాన్యాస






పూర్వక రుద్రాభిషేకం, రుద్ర హోమం ఒగ్గుపూజారులచే పెద్దపట్నం కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమాలలో దేవాలయ ఉప ప్రధాన అర్చకులు పాతర్లపాటి రవీందర్, ఐనవోలు ఎస్ఐ పస్తం శ్రీనివాస్, ముఖ్యార్చకులు పాతర్లపాటి శ్రీనివాస్, ఐనవోలు మధుకర్ శర్మ,వేద పారాయణదారులు గట్టు పురుషోత్తం శర్మ,విక్రాంత్ వినాయక జోషి, అర్చకులు నందనం భానుప్రసాద్ శర్మ,ఉప్పుల శ్రీనివాస్, పాతర్లపాటి నరేష్ శర్మ,నందనం మధు శర్మ,మడికొండ దేవేందర్,ఐనవోలు మాజీ ఎంపీటీసీ బొల్లెపల్లి మధు,సిబ్బంది,భక్తులు పాల్గొన్నారు.

తరంగాలు Tharangalu Daily News Paper RNI . TELTEL / 2022 / 83463

# కౌకొండలో ఇందిరమ్మ ఇండ్ల ఇంటి ఇంటి సర్వే



**నడికూడ, డిసెంబర్ 16 తరంగాలు**
ఇందిరమ్మ ఇంటి నిర్మాణ కొరకై కౌకొండ గ్రామం లో ప్రజా పాలన లో భాగంగా స్థానిక శాసన సభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి ఆదేశాల మేరకు రెండవ రోజు ఇందిరమ్మ ఇళ్ళు..ఇంటి ఇంటి సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమం లో గ్రామ అధికారి, పంచాయతీ కార్యదర్శి విద్యాసాగర్, ఇందిరమ్మ కమిటీ సభ్యుడు మేకల కుమారస్వామి, దర్మల్ల సదానందం, చుక్క కుమార్, గ్రామ పెద్దలు గ్రామస్తులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాలో గొల్లకురుమల సమస్యల గురించి చర్చించాలి19న చలో హైదరాబాద్ జయప్రదం చేయండి.



**తరంగాలు న్యూస్ డిసెంబర్ 16 చెన్నారావుపేట**
మండలంలోని జిఎంపిఎస్ మండల కార్యదర్శి జక్క రవి.సోమవారం నుండి జరిగే శీతకాల అసెంబ్లీ సమావేశాల్లో గొల్లకురుమల సమస్యల గురించి చర్చించాలని గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం(జి ఎం పి ఎస్) చెన్నారావుపేట మండల కార్యదర్శి జక్క రవి అన్నారు.వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండల ఖాదర్ పేట,జల్లి, గొల్లపల్లె, చెన్నారావుపేట గ్రామాలలో ఈనెల 19న ఇందిరాపార్క్ ముందు నిర్వహించే ధర్నాని జయప్రదం చేయాలని ముద్రించిన కరపత్రాలను గొల్లకురుమల నాయకులతో కలిసి ఆవిష్కరించారు అనంతరం చెన్నారావుపేట మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మండల కార్యదర్శి జక్క రవి మాట్లాడుతూ నేటి నుంచి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఈ సమావేశాలలో గొల్లకురుమల సమస్యల గురించి మాట్లాడి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని వారు డిమాండ్ చేశారు, ఎన్నికల సందర్భంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ప్రభుత్వ భూములను రక్షించి గొర్రెల కాపరులకు మూగజీవాల మేత కోసం కేటాయించాలని డిమాండ్ చేశారు, కుక్కల దాడిలో,ఇతర కారణాలతో చనిపోయిన గొర్రెలకు ఇన్సూరెన్స్ తో సంబంధం లేకుండా గొర్రెల కాపరికి నష్టపరిహారం ప్రభుత్వమే చెల్లించాలి, తదితర డిమాండ్ల సాధనకైడిసెంబర్19నఇందిరాపార్క్ ముందు నిర్వహించే ధర్నాకు గొల్ల కురుమలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో గొర్రెలు,మేకల పెంపకందార్ల సంఘం మండల ఉపాధ్యక్షులుకుండే కుమారస్వామి, జక్క వెంకటేశ్వర్లు, కుండే కట్టయ్య, గుంటి కుమారస్వామి, కుండే రవి,కుక్కల రాజు,ఆరే మహేందర్,కుక్కల రజనీకాంత్, కుక్కల అజయ్, వడ్డే రవి, బట్టమేకల రవికుమార్, బట్టమేకల రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

# బూత్ స్థాయి నుండి బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

**మాజీ ఎమ్మెల్యే,బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్**





**వర్ధన్నపేట, 16డిసెంబర్, తరంగాలు:**
గ్రామ గ్రామాన బూత్ స్థాయి నుండి బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కంకణబద్ధులై పని చేయాలని మాజీ ఎమ్మెల్యే,బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్ కోరారు.సంస్థాగత నిర్మాణంలో భాగంగా బీజేపీ మండల అధ్యక్షులు రాయపురపు కుమారస్వామి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన వర్ధన్నపేట మండలంలోని ఇల్లంద గ్రామంలోని బూత్ కమిటీల ఎంపికలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షులు,వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇల్లంద గ్రామంలో బూత్ కమిటీ అధ్యక్షులను ఎంపిక చేశారు.222 బూత్ అధ్యక్షుడు కార్తీక్ వేల్పుల,223 బూత్ అధ్యక్షుడు సట్ల అనిల్,224 బూత్ అధ్యక్షులు కొట్టూరి రవి,225 బూత్ పోశాల సురేష్ లను ఎన్నుకోగా వారిని శ్రీనివాస్,బుచ్చిబాబు, వెంకటేశ్వర్లు,దూడయ్యలు ప్రతిపాదించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు నాంపల్లి యాకయ్య,నరసింహారెడ్డి,మంచె సాయిలు, దూడయ్య, సాంబయ్య,సురేష్,సట్ల బిక్షపతి, దుర్గయ్య,తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి





**-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**

**నల్గొండ ఆర్సీ,16 డిసెంబర్, తరంగాలు:**
ప్రజావాణి ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం లోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఫిర్యాదుల స్వీకరణ అనంతరం జిల్లా అధికారులతో ప్రజావాణి ఫిర్యాదులపై ఆమె సమీక్షించారు.రెవిన్యూ, మున్సిపల్, పంచాయతీరాజ్, విద్యుత్ , వ్యవసాయ తదితర శాఖల వద్ద ఫిర్యాదులు ఎక్కువగా పెండింగ్లో ఉన్నాయని, ఈ శాఖల అధికారులు ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పరిష్కరించాలని చెప్పారు.ఎప్పటి ఫిర్యాదులు అప్పుడే పరిష్కరించాలని, ముఖ్యంగా ఫిర్యాదుల పరిష్కారం వేగంగా ఉండాలని అన్నారు. వచ్చే వారం నాటికి అన్ని శాఖలు సాధ్యమైనంత ఎక్కువ ఫిర్యాదులను పరిష్కరించాలని చెప్పారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సంవత్సరం క్రిస్మస్ వేడుకలలో భాగంగా అన్ని నియోజకవర్గాలలో క్రిస్మస్ వేడుకల సందర్భంగా విందు ఏర్పాటు చేయాలని, ఇందుకు సంబంధించి ఆర్డీవోలు, తహసిల్దారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి ఎవరైనా కొత్తగా దరఖాస్తులు ఇస్తే ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన సేవా కేంద్రాల్లో తీసుకోవాలని, గతంలో దరఖాస్తు చేసుకున్న వారు తిరిగి దరఖాస్తు చేసుకోకూడదని ఆమె కోరారు.కాగా ఈ సోమవారం (50) మంది ఫిర్యాదు దారులు వారి ఫిర్యాదులను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డిఆర్ఓ అమరేందర్, జెడ్పిసిఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు

**-కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి**

**-న్యాయం జరిగేంత వరకు ఎస్ఎఫ్ఐ గా అండగా ఉంటాం**

**-పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనం పెంచాలి**

**-ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్**



**వరంగల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 16,(తరంగాలు)**
సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ డిమాండ్ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ ఈరోజు ఏకశిలా పార్కు వద్ద సమగ్ర శిక్ష ఉద్యోగులు గత 11 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్నారు సమగ్ర శిక్షలో కాంట్రాక్టు విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని పేస్కేల్ ఇవ్వాలని కోరుతూ సమ్మె చేస్తున్నారని వీరికి ఎస్ఎఫ్ఐ సంపూర్ణ మద్దతు ఇస్తుందని అన్నారు 18 సంవత్సరాలుగా 19600 మంది ఉద్యోగులు పనిచేస్తున్నప్పటికీ వారిని రెగ్యులరైజ్ చేయకపోవడం అంతేకాకుండా కాంగ్రెస్ మేనిఫెస్టోలో వారిని రెగ్యులర్ చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వారు సమ్మె చేస్తున్నప్పటికీ ఈ ప్రభుత్వం నిమ్మకు నేరతనట్లుగా వ్యవహరిస్తున్నారు 18 ఏళ్లుగా వారు తక్కువ వేతనాలకు పనిచేస్తున్నారు. కాబట్టి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారికి వేతనం పెంచాలని అన్నారు జిల్లా స్థాయిలో ఏపీవో సిస్టం అనలిస్టు టెక్నికల్ పర్సనల్ ఆపరేటర్లు డిఎంఎంటి మెసెంజర్లు అదేవిధంగా మండల స్థాయిలో ఎమ్మెల్యే కోఆర్డినేటర్లు డాటా ఎంట్రీ ఆపరేటర్లు స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో సిఆర్పిలుగా పాఠశాల స్థాయిలో పనిచేస్తున్న వారందరికీ రెగ్యులరైజ్ చేయాలని అదేవిధంగా వారికి ఆరోగ్య కార్డులో మహిళలకు ప్రసూతి సెలవులు జీవిత బీమా ఇవ్వాలని అన్నారు.వీటన్నిటి సమస్యల పైన ప్రభుత్వానికి ఎన్ని విజ్ఞప్తులు చేసినా పట్టించుకోకపోవడంతో వారు నిరవధిక సమ్మెకు దిగి ఆందోళన చేస్తున్నప్పటికీ కూడా ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం తక్షణమే స్పందించి వారు కోరుతున్నటువంటి న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని అన్నారు లేని ఎడల వారికి అండగా ఎస్ఎఫ్ఐ నిలిచి పెద్ద ఎత్తున పోరాటాలు ఉధృతం చేస్తామని అన్నారు.

# సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం.



**-జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి జిల్లా ప్రధాన కార్యదర్శి మన్నెంవీరేందర్ రెడ్డి.**

**తరంగాలు న్యూస్ డిసెంబర్ 16**
సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశం చెన్నారావుపేట మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశము జాతీయ అధ్యక్షుడు జంగిటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఏటి ఆంజనేయులు, రాష్ట్ర అధ్యక్షులు ఎలిగండ్ల వెంకటేష్, ఆదేశానుసారం జిల్లా అధ్యక్షుడు కాట కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి మన్నెం వీరేందర్ రెడ్డి, సమీక్షంలో జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య ఉద్దేశం 2025 సంవత్సరం క్యాలెండర్ ఆవిష్కరణ కోసం నూతన మండలాల ఎన్నికల విషయం మరియు హైకోర్టు సుప్రీంకోర్టు సమాచార పరిరక్షణ కమిటీ. వేసిన లేఖలు అనుకూలంగా వచ్చిన లేఖల విషయం గురించి కిందిస్థాయి అధికారులు తమ తప్పులను కప్పిపుచ్చుకుంటూ తప్పుడు ధ్రువ పత్రాలను సమాచారం అందిస్తున్న వారిపై ఆయా సెక్షన్ నెంబర్లను అనుసరించి వారిపై పోలీస్ కంప్లైంట్ పెట్టాలని నిర్ణయం చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలో రాష్ట్ర గవర్నమెంటు వెంటనే స్పందించి సమాచార హక్కు చట్టం కమిషన్ వెంటనే నియమించాలని కోరడం జరిగింది.ఈ కార్యక్రమంలో వరంగల్ ఇన్చార్జ్ పూర్ణ కుమార్, వరంగల్ యూత్ కన్వీనర్ సాదా బోయిన రాజు, న్యాయవాది రహీముద్దీన్, వరంగల్ ఉపాధ్యక్షులు మల్లాడి వీరారెడ్డి, వరంగల్ అసెంబ్లీ ఇన్చార్జ్ కూస సుదర్శన్, వర్ధన్నపేట ఇంచార్జ్ నాగరాజు, నర్సంపేట ఇంచార్జ్ జాటోతు యాకుబ్, చెన్నారావుపేట మండల అధ్యక్షుడు చెలుకలపెల్లి రాజు, ప్రధాన కార్యదర్శి గూగులోత్ అమ్రు నాయక్,దుగ్గొండి మండల అధ్యక్షుడు గూడెపు అమరేందర్, మండల ఉపాధ్యక్షుడు మనుబోతుల శివకుమార్, నర్సంపేట మీడియా ఇంచార్జ్ మాదారపు శ్రీనివాస్, నర్సంపేట మండల అధ్యక్షుడు కట్ల మోహన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నూనె అశోక్, ఉపాధ్యక్షుడు పుట్ట సురేష్, నెక్కొండ మండల అధ్యక్షుడు జాటోత్ అనిల్ నాయక్, ప్రధాన కార్యదర్శి బానోతు రాము నాయక్, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులు మంచి నైపుణ్యాన్ని కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలి





**-జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి**


**నల్గొండ ఆర్సీ,16డిసెంబర్, తరంగాలు :** సీఎం కప్ క్రీడా పోటీలలో పాల్గొంటున్న జిల్లా క్రీడాకారులు మంచి నైపుణ్యాన్ని కనబరిచి జిల్లాకు పేరు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి కోరారు.సోమవారం ఆమె నల్గొండ జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో ఈనెల 16 నుండి 21 వరకు నిర్వహించనున్న సీఎం కప్ క్రీడా పోటీలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అంతేకాక సీఎం కప్ క్రీడా పోటీల ప్రారంభ సూచకంగా క్రీడా పథకాన్ని ఎగురవేశారు.అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామస్థాయి నుండి రాష్ట్రస్థాయి వరకు ప్రతిభ ఉన్న క్రీడాకారులను గుర్తించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడలలో రాణించే విధంగా శిక్షణ ఇవ్వడమే సీఎం కప్ క్రీడా పోటీల ముఖ్య ఉద్దేశ్యం అని అన్నారు.అందువల్ల క్రీడాకారులు వారిలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆమె కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు,బాలింతలు, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలను











**-సికేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ**

**-జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా**

**వరంగల్ ప్రతినిధి ,16 డిసెంబర్, తరంగాలు:** ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు, బాలింతలు, నవజాత శిశువులకు మెరుగైన వైద్య సేవలను అందించాలని వైద్యులు, సిబ్బందిని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా ఆదేశించారు. వరంగల్ లోని సికేఎం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఇన్ పేషంట్, ఔట్ పేషంట్, నవజాత శిశువులకు అందిస్తున్న వైద్య సేవల గదులతోపాటు ల్యాబ్,పరిపాలన విభాగం, ఆంటీనేటల్ వార్డ్, లేబర్ గది, పోస్ట్ నెటల్ వార్డ్, ఆపరేషన్ థియేటర్,ఫార్మసీ స్టోర్, కిచెన్ లను కలెక్టర్ పరిశీలించారు. వైద్య సేవలకు సంబంధించిన పలు రికార్డులను కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయా అని కలెక్టర్ ఆరా తీశారు. సమస్యలు ఉన్నట్లయితే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. సమీకృత సలహా పరీక్ష(ఐసీటీసీ) కేంద్రాన్ని, అదేవిధంగా ఆసుపత్రిలోని హెచ్ఐవి టెస్ట్ సెంటర్ను కలెక్టర్ పరిశీలించారు. ఆసుపత్రిలోని ఐపి, ఓపీ సంఖ్యను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి వచ్చే గర్భిణీలు బాలింతలు నవజాత శిశువులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వైద్య సేవలను అందించాలన్నారు. ఆసుపత్రిలో ఏవైన ఇబ్బందులు ఉంటే పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో వర్తించే వివిధ జబ్బులకు సంబంధించిన వివరాలతో కూడిన జాబితాను ప్రదర్శించేలా బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.ఈ సందర్భంగా వైద్యులు, సిబ్బందికి పలు సలహాలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలతో అందుతున్న వైద్యం గురించి కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి ప్రతిరోజు 300 మంది పేషంట్లు వస్తున్న దృష్ట్యా ప్రస్తుతమున్న రెండు ఓపి కౌంటర్లకు అదనంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. శానిటేషన్ వ్యవస్థ మెరుగుపరుచుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సందర్భంగా వంటగదిని కలెక్టర్ స్వయంగా సందర్శించి సరుకుల నాణ్యతను,వండిన వంట పదార్థాలను పరిశీలించారు. ఆసుపత్రి డాక్టర్లతో పాటు సిబ్బంది అందరికీ బయోమెట్రిక్ అటెండెన్స్ తో పాటు ఐడి కార్డులు అందజేయాలన్నారు.ఆస్పత్రి ఇరువైపులా వెంటనే సీసీ కెమెరాలు అమర్చుటకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పేషెంట్లకు ప్రతి ఔషధం ఆస్పత్రి నుండే అందజేయాలని బయట నుండి పేషెంట్ల ద్వారా తెప్పించినట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఫార్మసీలో అధికంగా తక్కువగా వినియోగించే ఔషధాల వివరాలు ఫార్మసిస్టును కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలో మల్టీ ప్యారా మానిటర్ను ప్రారంభించారు.ఆసుపత్రిని, పరిసరాలను పరిశీలించి పనికిరాని వస్తువులను పరిసరాలలో పేరుకొని ఉన్న పిచ్చి మొక్కలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. పరిసరాలలో ఎలుకల నివారణ నిమిత్తం కాంక్రీట్ వేయాలని సూచించారు. పేషెంట్లకు మెరుగైన వైద్యం అందించడంలో భాగంగా వారి సౌకర్యార్థం కావలసిన పరికరాలు, సిబ్బంది తదితర వివరాలను ఉన్నతాధికారులకు పంపుటకు గాను వెంటనే సమర్పించాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షర్మిల, ఆర్ ఎం ఓ లు డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ సత్య జిత్ రే ,ఏవో సాజిద్,వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నేడు బీఆర్ఎస్ నిరసన



**నర్సంపేట,డిసెంబర్ 16 తరంగాలు:** కొడంగల్ నియోజకవర్గం లోని లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడంపై నిరసనగా మంగళవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్ర పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి తెలిపారు. లగచర్ల రైతులపై అక్రమంగా కేసులు పెట్టి వారిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించి జైళ్ళలో నిర్బంధించి రైతన్నల చేతులకు బేడీలు వేసినా కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, అమానవీయ, అణిచివేత విధానాలకు నిరసనగా రైతులపై నమోదు చేసిన అక్రమ కేసులను ఎత్తివేసి వారిని వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నర్సంపేట నియోజకవర్గం లోని అన్ని మండల కేంద్రాలలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు వినతి పత్రాలను సమర్పించి, నిరసన వ్యక్తం చేయాలని పెద్ది పిలుపునిచ్చారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పని చేయాలి

**-మండల సంస్థాగత ఎన్నికల అధికారి బన్న ప్రభాకర్**

**-జోరుగా భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ**



**ఐనవోలు,16డిసెంబర్,తరంగాలు:** వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పార్టీ కార్యకర్తలు పని చేయాలని మండల సంస్థాగత ఎన్నికల అధికారి బన్న ప్రభాకర్ అన్నారు.సోమవారం వర్ధన్నపేట నియోజకవర్గంలోని ఐనవోలు మండలం పంతిని గ్రామంలో భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా బూత్ అధ్యక్షులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల సంస్థాగత ఎన్నికల అధికారి బన్న ప్రభాకర్,జిల్లా సంస్థగత ఎన్నికల అధికారి మాదిరెడ్డి దేవేందర్ రెడ్డి పాల్గొని బూత్ అధ్యక్ష ఎన్నికలు నిర్వహించారు.ముంజ బాబు,ఉడుత పూర్ణచందర్ లను బూత్ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా బన్న ప్రభాకర్ మాట్లాడుతూ , బూత్ లను పటిష్ఠపరిచి కార్యకర్తలను ఉత్సాహపరుస్తు.. ప్రజల సమస్యలపై పోరాడుతూ.. నిత్యం ప్రజల్లో ఉండాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నియోజకవర్గ మాజీ కన్వీనర్ శ్రీరామ్ భూపాల్, వర్ధన్నపేట నియోజకవర్గ సభ్యత్వ ప్రముఖు జడ సతీష్,జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి,పాల్గొన్నారు.పంతిని ఎన్నికల అధికారి మెరుగు అనిల్ కుమార్,సట్ల సోమన్న,శక్తి కేంద్రం ఇంచార్జ్ మోడం మహేందర్,బాల్య మహేష్,కళ్ళేపు విజయ్,పొన్న కుమార్,రంజిత్,దొంతి సునీల్,బూస సురేష్,ఉడుతల శివ,శానరాజు,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత.




**నల్లబెల్లి, డిసెంబర్ 16 (తరంగాలు):** నల్లబెల్లి పోయిన సెల్ ఫోన్ వెతికి పట్టుకున్న పోలీసులు సోమవారం బాధితురాలికి అప్పగించారు నల్లబెల్లి ఎస్ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా ఏటూరు నాగారం గ్రామానికి చెందిన బట్ట ప్రత్యూష నల్లబెల్లి మండలం రెలకుంటలో సెల్ ఫోన్ పోయిందని గత నవంబర్ 22 న నల్లబెల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. వెంటనే సెల్ఫోన్ పోగొట్టుకున్న ప్రాంతం వివరాలతో బాధితురాలి పేరు చిరునామా గుర్తింపు పత్రం ఓటీపీ కోసం ఫోన్ నంబర్ను ఫిర్యాదులో పొందుపర్చాలని సూచించారు. ఆయా వివరాలతో పోర్టల్లో నమోదు చేసిన అనంతరం పోగొట్టుకున్న ఫోన్ పనిచేయకుండా బ్లాక్ చేసి, ఎవరు వినియోగిస్తున్నారో గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు ఐఎంఈఐ ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్మెంట్ ఐడెంటిటీ నంబర్ సహాయంతో సెల్ ఫోన్ స్వాధీనం చేసుకుని బాధితుడికి తిరిగి అప్పగించినట్లు తెలిపారు

# కుక్కల దాడిలో చనిపోయిన గొర్రెలకు నష్టపరిహారం చెల్లించాలి

**జిఎంపిఎస్ జిల్లా కార్యదర్శి పరికి మధుకర్.**





**తరంగాలు న్యూస్ డిసెంబర్ 16**

నెక్కొండమండలంలోని రెడ్లవాడ గ్రామనికి చెందిన మేకల శ్రీను గొర్రెల కాపరి గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 10 గొర్రెలను చంపాయని ఫోన్ ద్వారా సమాచారం ఇవ్వగా జిల్లా కార్యదర్శి పరికి మధుకర్ మాట్లాడుతూ నష్టపోయిన మేకల శీను కుటుంబాన్ని నష్టాన్ని అంచనా వేసి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు, ఉమ్మడి రాష్ట్రంలో గొర్రెలకు ఇన్సూరెన్స్ ప్రభుత్వమే చేయించేదని, కానీ గత ప్రభుత్వం,ప్రస్తుత ప్రభుత్వం గొర్రెలకు ఇన్సూరెన్స్ చేయకపోవడంతోటే కుక్కల దాడిలో, ఇతర కారణాలు చనిపోయిన గొర్రెలకు నష్టపరిహారం అందక గొర్రెల కాపర్లు పూర్తిగా నష్టపోతున్నారని ఆవేదన చెందారు, ఇన్సూరెన్స్ తో సంబంధం లేకుండా రాష్ట్ర ప్రభుత్వమే గొర్రెల కాపరులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, ఇప్పటికైనా కుక్కల నివారణకు చర్యలు చేపట్టాలని వారు అన్నారు,రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టి మూగజీవాలకు ఇన్సిడెంట్ చేయించాలని వారు డిమాండ్ చేశారు.

# విద్యార్థులకు ఆంగ్ల వ్యాకరణ (స్పోకెన్ ఇంగ్లీష్) పుస్తకాలు పంపిణీ

**విద్యతోనే ఉన్నత శిఖరాలను అదిరోహించగలరు**



**వర్ధన్నపేట,16డిసెంబర్,తరంగాలు:**
వర్ధన్నపేట మండలంలోని నల్లబెల్లి గ్రామంలో చమక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జడ్పీఎస్ఎస్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా ఆంగ్ల వ్యాకరణ (స్పోకెన్ ఇంగ్లీష్) పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జాతీయ యువజన అవార్డు గ్రహీత జక్కి శ్రీకాంత్,నిర్వాహకులు చమక్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు విద్యావేత్త ప్రొఫెసర్ మహమ్మద్ ఆజామ్ హాజరై మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలంటే చదువు ద్వారానే ఏ లక్ష్యాన్నైనా నెరవేర్చగలరని అన్నారు. భవిష్యత్తులో ప్రపంచంతో పోటీ పడాలంటే ఇంగ్లీష్ అనేది అత్యవసరమైన పరిస్థితి అని ఆంగ్లజ్ఞానంతోటే తమ లక్ష్యాలను నెరవేర్చుకోగలరని విద్యార్థులకు సూచించారు. చమక్ ఫౌండేషన్ ఎన్నో సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ నేడు దివంగత విద్యావేత్త వెంకట్ నారాయణ జ్ఞాపకార్థం పుస్తకాల పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. విద్యా వ్యవస్థలో నూతన మార్పులు తీసుకొచ్చి కంప్యూటర్ పై అవగాహనతో కోడింగ్ లాంటి కోర్సులు విద్యార్థులు ప్రాథమిక స్థాయిలోనే అవగాహన కలిగి ఉండాలని భవిష్య విద్యా విధానానికి తగ్గట్టుగా విద్యను అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రమేష్,అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ చెంగల శ్రీలత, ఉపాధ్యాయులు తాటికాయల కుమార్,పిఈటి, ఉపాధ్యాయురాలు, యువజన నాయకులు, మరిపట్ల సందీప్,రాజు, విద్యార్థులు ,తదితరులు పాల్గొన్నారు.

# యువ నేతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 364వ రోజు అన్నదానం



**వరంగల్,16డిసెంబర్,తరంగాలు:**
యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ వారి ఆధ్వర్యంలో వరంగల్ కరీమాబాద్ బొమ్మలగుడి భవాని పాఠశాలలో 1988-89 సంవత్సరంలో ఐదవ తరగతి చదివిన మిత్రబృందం సోమవారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సందర్భంగా హనుమకొండ ములుగు రోడ్డులోని స్వయంకృషి వృద్ధాశ్రమ వృద్ధులకు 364వ రోజు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భవాని పాఠశాలలో ఐదవ తరగతి చదువుకున్న మిత్రబృందం,యువ నేతాజీ ఫౌండేషన్ వరంగల్ అధ్యక్షులు కొత్తకొండ అరుణ్ కుమార్,వరంగల్ పోలీస్ కానిస్టేబుల్ కన్నె రాజు (స్విమ్మర్ రాజు), కానిస్టేబుల్ బొట్టు కమలాకర్,కోలా రాజేష్,ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజ్జెల సుమన్,అలువాల పృథ్వీ, ఉప్పరపల్లి రాజ్ కుమార్,మునిగాల రాంప్రసాద్, ఊరటి రవికుమార్,సృజన,జ్యోతి,భావన, బిటుకూరి యాకయ్య,పాలకుర్తి విష్ణు,ఎస్.కె ముస్తఫా,లీగల్ అడ్వైజర్ రాచకట్ల కృష్ణ (హైకోర్ట్ అడ్వకేట్),యాద రవికుమార్,చెలిమల్ల అశోక్ కుమార్,తూనం రాము,సిఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ వైనాల రమేష్,మోడెం రాజశేఖర్ గౌడ్,నాగవెల్లి కార్తిక్,తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్కూల్ యూనిఫామ్, ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమము...

**-ప్రభుత్వ పాఠశాలలో చదువుకునే పేద విద్యార్థినీ, విద్యార్థులకు సేవ చేయడంలోనే నిజమైన ఆనందం**

**-ట్రస్ట్ చైర్మన్ ,మాజీ శాసనసభ్యులు బిక్షపతి యాదవ్**



**శేరిలింగంపల్లి 16డిసెంబర్,తరంగాలు:**
సోమవారం మసీదు బండ కొండాపూర్ హై స్కూల్ మరియు ప్రైమరీ స్కూల్ విద్యార్థినీ, విద్యార్థులకు సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత బట్టలు, ఉచిత నోట్ బుక్స్ పంపిణీ కార్యక్రమాన్ని ట్రస్ట్ యజమాన్యం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ బిక్షపతి యాదవ్ గారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుకుని పేద విద్యార్థులకు సహాయ సహకారాలు అందించడంలో మా ట్రస్ట్ గత 20 సంవత్సరాలుగా అనేక సేవ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతూ ఎంతోమంది పేద విద్యార్థుల జీవితాలలో వెలుగులు నింపమని సంతోషిస్తూ మీరంతా బాగా చదువుకొని ఈ సమాజానికి మిమ్మల్ని కన్నా తల్లిదండ్రులకు , మీకు విద్య నేర్పిన గురువులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని కోరుతూ,మునుముందు కూడా ఇంకా ఎన్నో సేవా కార్యక్రమాలు చేయడంలోమా ట్రస్టు మీకు అందుబాటులో ఉంటుందని తెలుపుతూ విద్యార్థినీ, విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఎవరికైనా కంటి సమస్యలు ఉన్నట్లయితే మా యొక్క సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆస్పత్రిలో ఉచితంగా కంటి పరీక్షలు చేయించి అవసరమైతే ఆపరేషన్ కూడా ఉచితంగా చేయిస్తామని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉమాదేవి , శ్రీనివాస్ ,సదానంద్ యాదవ్, ఆంజనేయులు సాగర్, శ్రీశైలం,రాజు యాదవ్ ,కుమార్, శ్రీకాంత్, అరుణ్ కుమార్, చంద్రశేఖర్, లక్ష్మణ్, పద్మ మొదలగు వారు పాల్గొన్నారు.

# రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించిన చైర్మన్,వైస్ చైర్మన్‌లు

**నారాయణఖేడ్,16డిసెంబర్,తరంగాలు:**
కంగ్టి ప్రధాన రహదారి నుండి ఖేడ్ మున్సిపాలిటీలోని నగిరేశం ఆలయం,ఇతర కాలానీల వద్ద నుండి కరస్ గుత్తికి వెళ్లే ప్రధాన రహదారిని కలుపుతూ ఏర్పాటు చేస్తున్న ఫార్మేషన్ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్,వైస్ చైర్మన్ దారం శంకర్ లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ప్రత్యేక చొరవతో ఏర్పాటు చేస్తున్న రోడ్డు పనులను ఆయన ఆదేశాల మేరకు పరిశీలించడం జరిగింది అన్నారు. పట్టణంలో రోజురోజుకు పెరుగుతున్న ట్రాఫిక్ సమస్య నుండి సులువుగా పట్టణం బయటకు తక్కువ సమయంలో వెళ్ళడానికి ఫార్మేషన్ రోడ్డు ఉపయోగపడుతుంది అన్నారు. పట్టణంలోని కాశినాథ్,నగిరేశం ఆలయాల



వెనుకనుండి కిలోమీటర్ల మేరకు ఫార్మేషన్ రోడ్డు వేయడం జరుగుతుంది అన్నారు. కంగ్టి,ర్యాకల్, సిర్గాపూర్ ల నుండి బీదర్,జహీరాబాద్ వైపు వెళ్లే వాహనదారులకు సౌకర్యం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రాజేష్, మాజీ ఎంపీటీసీలు రామకృష్ణ,పండరిరెడ్డి, స్థానికులు రాములు తదితరులు పాల్గొన్నారు.

# చలిగాలితో.. రక్షణ చర్యలు తీసుకోకుంటే ముప్పే జాగ్రత్తగా మెలగాలి

**-చలితో చిన్న పిల్లలు,వృద్ధులకు ఎక్కువ ఇబ్బంది**

**-జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా**

**హన్మకొండ ప్రతినిధి డిసెంబర్ 16 (తరంగాలు)**
ఈ ఏడాది చలి తీవ్రత పెరిగి నవంబర్ నుంచే తన ప్రతాపాన్ని చూపెడుతోంది. చలి తీవ్రత పెరుగుతుండడంతో సాయంత్రం నుంచే ప్రజలు ఇళ్లకు చేరుకుంటున్నారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ..రాత్రి వేళల్లో ప్రజలు బయటకు వేళ్లేందుకు వణికిపోతున్నారు. ఉదయం 9 గంటల వరకు కూడా చలి తీవ్రత తగ్గకపోవడం తో ప్రజలు బయటకు వచ్చే పరిస్థితి లేదు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లే వారు స్వెటర్లు, శాలువాలు ఇతర రక్షణ దుస్తులు ధరించి వెళ్తున్నారు. చలి తీవ్రత



పెరుగుతున్నందున జాగ్రత్త చర్యలు తీసుకోకుంటే వ్యాధుల భారిన పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. రక్తపోటు, జలుబు, దగ్గు,శ్వాస సంబంధిత ఆస్తమా, సీఓపీడీ,హైపో థైరాయిడ్, ఎనీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వాళ్లు జాగ్రత్తలు పాటించాలి. శరీరంలో ఉండే కొవ్వు చలి నుంచి మనల్ని రక్షిస్తుంది. ఎక్కువ బరువు ఉన్నవారికి తక్కువ చలి వేస్తుంది. దీనికి కారణం చెడు అలవాట్లు, డిహైడ్రేషన్,రక్త ప్రసరణ తగ్గిపోవడం,రక్తంలో ఎర్ర రక్త కణాలు తగ్గడం చలికాలంలో పాటించాల్సిన జాగ్రత్తలు. ప్రజలకు పలు సూచనలు చేశారు. పిల్లలు,వృద్ధులు సూర్యోదయం కంటే ముందు బయటకు రాకూడదు. చలి నుంచి రక్షణ పొందేందుకు ప్రజలు స్వెటర్లు,హ్యాండ్ గ్లోవ్స్,మాస్కు, సాక్సు ధరించాలి. కూల్ డ్రింక్స్ తాగకూడదు. ఆహారం,నీరు గోరువెచ్చగా ఉండేలా చూసుకోవాలి. ఉదయం, సాయంత్రం గోరు వెచ్చని నీటిని తాగడం వల్ల చలి నుంచి కొంత ఉపశమనం కలుగుతుంది. గుండె జబ్బులు, శ్వాస సంబంధిత దీర్ఘకాలిక రోగాలు ఉన్నవారు మార్నింగ్ వాకింగ్, జాగింగ్ మానేసి సాయంకాల సమయంలో 6 గంటల లోపు చేస్తే మంచిది. ఏ సీలు, కూలర్లు, ఫ్యాన్ల వాడకం తగ్గించాలి. చలిమంటలు కాగకూడదు. మంచుకురిసే సమయంలో బయట తిరగొద్దు. చర్మం,పెదవులు పగుళ్లకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఆరోగ్య సమస్యలు వస్తే వైద్యులను సంప్రదించి సలహాలు, సూచనలు,చికిత్స పొందాలి.

# మధ్యాహ్న భోజనంలో విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలి

**-నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు**

**-పంతిని గ్రామ అధ్యక్షులు మదూరి మల్లేశం**

**ఐనవోలు,16డిసెంబర్,తరంగాలు:**
ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించకూడదని కాంగ్రెస్ పార్టీ పంతిని గ్రామ అధ్యక్షులు మదూరి మల్లేశం అన్నారు. సోమవారం ఐనవోలు మండలంలోని పంతిని గ్రామ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని కాంగ్రెస్ పార్టీ పంతిని గ్రామ అధ్యక్షులు మదూరి మల్లేశం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు,టీపీసీసీ అధికార ప్రతినిధి బండి సుధాకర్ గౌడ్,ఐనవోలు మండల పార్టీ అధ్యక్షుడు సమ్మెట మహేందర్ గౌడ్ ఆదేశాల మేరకు



ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వంట చేసే వారికి పలు సూచనలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మదురి జ్యోతి,ఉపాధ్యాయులు ఇజ్జగిరి సమ్మయ్య, నాయకులు బరిగెల స్వామి, బండి రమేష్,మదూరి రాజు,చిర్ర శ్రీధర్,మదూరి రాజు(చిన్న), దాంసాని రాము,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాల విమర్శలకు చేతలతోనే సమాధానం

-ప్రజా పాలనలో సంక్షేమానికే పెద్దపీట
-గ్రామాల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది
-చిల్లర విమర్శలకు ప్రజలే సమాధానం చెప్తరు
-మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బిర్రు రాజు





**వర్ధన్నపేట,16డిసెంబర్,తరంగాలు:** ప్రతిపక్ష బీజేపీ, బిఆర్ఎస్ నాయకుల అబద్దపు ప్రచారాలు, విమర్శలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేతలతోనే సమాధానం చెప్తుందని మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ,యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బిర్రు రాజు అన్నారు.సోమవారం వర్ధన్నపేట శాసనసభ్యులు కెఆర్ నాగరాజు ఆదేశాల మేరకు మండలంలోని నల్లబెల్లి గ్రామంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిర్రు రాజు తన స్వంత నిధులతో రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎద్దు సత్యనారాయణ, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకులు బిర్రు రాజు మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో నలిగి విసిగిన ప్రజలు మార్పు కోరుకుని ప్రజలు తెచ్చుకున్న ప్రజా ప్రభుత్వంలో సంక్షేమానికే పెద్దపీట వేసి కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో చిద్రమైన గ్రామీణ వ్యవస్థను పునరుజ్జీవింపజేసే దిశగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని,బాధ్యత కలిగిన పార్టీ కార్యకర్తలు సైతం అందులో బాగస్వాములుగా మారి గ్రామ సర్వతో ముఖాభివృద్ధికి పాడుతున్నామని అన్నారు.గత ప్రభుత్వం లాగ కేవలం మాటలకే పరిమితం కాకుండా గ్రామాల్లో సమస్యలను పరిష్కరించడంలో చేతల ప్రభుత్వంగా కాంగ్రెస్ ముందుకు పోతున్నదని అన్నారు.రాష్ట్రంలో ఏడాది పాలన పూర్తి చేసుకున్న ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు ఇచ్చిన కీలక హామీలను అమలు చేసే దిశగా పాలన సాగిస్తూనే ప్రజలకు అవసరమైన సంక్షేమాన్ని సాగిస్తున్నదని అన్నారు. రైతులకు రుణమాఫీ పేర 10 ఏండ్లు పాలించి ఒక్క రైతుకు పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయలేని బిఆర్ఎస్ దేశంలోనే కనివిని ఎరుగని రీతిలో ఏకకాలంలో రూ. 2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని అన్నారు.కేవలం సంవత్సర కాలంలో రైతుల సంక్షేమానికి రూ. 50 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి రాష్ట్రంలో రైతులపై కాంగ్రెస్ పార్టీకి ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.అధే విధంగా రాష్ట్రంలో మహిళలను కోటీశ్వరులను చేసే కార్యక్రమంలో భాగంగా కీలకమైన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందన్నారు. బిఆర్ఎస్ పాలనలో నిరుద్యోగులను నిలువున ముంచిన కారణంతో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అధికారంలోకి తెచ్చుకున్న 10 నెలల్లోనే 55 వేలకు పైగా ఉద్యోగాలిచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందన్నారు.ఇచ్చిన మాట మేరకు ప్రజలకు అందుబాటులో ఉంటూ కాంగ్రెస్ సాగిస్తున్న పాలనను రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు ఆశిర్వదించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు .రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రామాల్లో వచ్చే ఆదరణను చూసి ప్రతిపక్షాల నోరు మూతపడుతుందని అన్నారు. ప్రతిపక్షాల మాయమాటలు నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరనే విషయాన్ని గుర్తించి బాధ్యతగా నడుచుకోవాలని ప్రతిపక్షాలను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్,యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు కుల్ల యాకాంతం,గ్రామ పార్టీ అధ్యక్షుడు తాటికాయల దిలీప్,జక్కి గోపాల్, సోసైటి డైరెక్టర్ మల్యాల దేవెందర్,జన్నపురెడ్డి సంపత్‌రెడ్డి,ఎండీ జాఫర్,బిర్రు యాకయ్య,గిరగోని యాదగిరి,దొమకొండ ప్రబాకర్, శ్రీపాద శ్రీను,సోమల్ల కుమార్,బోడపట్ల కుమారస్వామి, తోపుచర్ల సంపత్‌రావు,ఆకారపు శంకర్, సోమల్ల మహేందర్, మేకల రాములు, ఆకారపు భిక్షపతి,జడ సాయిలు, దూడయ్య, జడ దూడయ్య. మేకల దేవేంరద్, పిన్నింటి వెంకట్ రెడ్డి,మేకల కుమార్,బిర్రు సురేష్, బిర్రు భాస్కర్,ఆరెల్లి నాగరాజు, మరిపట్ల ప్రశాంత్, తాటికాయల నాగరాజు.గుండేటి శివకృష్ణ,బిర్రు రమేష్,గ్రామ రైతులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

# గొల్ల కురుమల చలో హైదరాబాద్ జయప్రదం చేయండి

-జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య
-రెండో విడత గొర్ల పంపిణీ నగదు బదిలీ రెండు లక్షలు అమలు చేయాలి



**ఐనవోలు,16డిసెంబర్,తరంగాలు:** గొల్ల కురుమల హక్కుల సాధనకై ఈ నెల 19న చేపట్టే చలో హైదరాబాద్ సభను జయప్రదం చేయాలని జీఎంపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య పిలుపునిచ్చారు.గొర్ల కాపర్లు ప్రమాదవశాత్తు చనిపోతే 10 లక్షల ఎక్స్ గ్రేషియో ఇవ్వాలని.ఈనెల 19న చలో హైదరాబాద్ ఇందిరా పార్కు దగ్గర జరిగే ధర్నాకు సొసైటీ అధ్యక్షులు గొర్ల కాపర్లు భారీ సంఖ్యలో హాజరై జయప్రదంలి చేయాలని గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాడబోయిన లింగయ్య షెఫర్డ్ డిమాండ్ చేశారు.సోమవారం మండల కమిటీ సమావేశం కావటి బద్వేల్ అధ్యక్షతన నిర్వహించారు.సమావేశానికి ముఖ్య అతిథిగా లింగయ్య షెఫర్డ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ సోమవారం నుండి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాలలో గొర్లకాపర్ల సమస్యల పరిష్కారానికి అసెంబ్లీలో గొర్ల పంపిణీకై ప్రత్యేక చర్య తీసుకొని నగదు బదిలీ ద్వారా అమలు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల పెంపకందార్ల సంక్షేమానికి కావాల్సిన నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేస్తుందని మండిపడ్డారు.అవినీతి సాకుతో రెండవ విడత గొర్రెల పంపిణీ చేయకుండా రెండేండ్ల తర్వాత డీడీలు వాపస్ ఇచ్చిందన్నారు.దీంతో గొల్లకురుమలు ఆర్థికంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రమాదాలలో ప్రతిరోజు వందలాది గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని విచారం వ్యక్తం చేశారు. ఎలాంటి నష్టపరిహారం అందటంలేదని ఆవేదన చెందారు. ప్రతి వనరులు తగ్గిపోతున్నాయన్నారు. శాఖలోని పశు వైద్యాధికారులు,సిబ్బంది ఖాళీలను సకాలంలో భర్తీచేయడం లేదన్నారు.పశువైద్యుల పని వేళలు కూడా గొర్రెల పెంపకందార్లకు ఉపయోగకరంగా లేవని,రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం నట్టల నివారణ మందులు ఇవ్వడంలేదని మండిపడ్డారు. పశు వైద్యశాలల్లో మందులు లేవని డాక్టర్లు చెబుతున్నారని వాపోయారు.దీంతో జీవాలకు కనీస వైద్యం అందటం లేదు.గొర్రెల పెంపకం దార్ల సంహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకుండా నిర్వీర్యం చేస్తున్నారని ఆరోపించారు.మహబూబ్ నగర్ జిల్లాలో డక్కని జాతి గొర్రెల పరిశోధన కేంద్రాన్ని క్రమంగా ఎత్తివేస్తు గొర్ల కాపర్ల వృత్తిపై దెబ్బతీసే ప్రమాదం ప్రయత్నం చేస్తుందని మండిపడ్డారు. ప్రభుత్వం స్పందించి వెంటనే సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. లేనిపక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి నల్లబెట్ట చిన్నరాజు. మండల ఉపాధ్యక్షులు కావటి బద్వేల్. బొమ్మకంటి యాకయ్య, దయాకర్, ఉడుత చేరాలు, నల్లబెట్ట వెంకటయ్య, భాస్కర్.జి బాబు,తదితరులు పాల్గొన్నారు .తదితరులు పాల్గొన్నారు.

# నగర సంకీర్తనలో పాల్గొన్న బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు కొండేటి శ్రీధర్





**వర్ధన్నపేట,16డిసెంబర్, తరంగాలు :** వర్ధన్నపేట పట్టణ కేంద్రంలో సోమవారం అయ్యప్ప స్వాములు నిర్వహించిన నగర సంకీర్తన కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు, వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ పాల్గొని ఆడుతూ.. పాడుతూ స్వామి వారి భజనలు చేశారు.అనంతరం వారి కుటుంబ సభ్యులు 3వ వార్డు కౌన్సిలర్ కొండేటి అనిత సత్యంల ఆధ్వర్యంలో నిర్వహించిన మహా పడిపూజ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షులు,వర్ధన్నపేట మాజీ శాసనసభ్యులు కొండేటి శ్రీధర్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు,తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర మహాసభల పోస్టర్ ఆవిష్కరణ




**వర్ధన్నపేట,16డిసెంబర్,తరంగాలు:** ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లం కార్తీక్ ఆవిష్కరించారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన ఏబీవీపీ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిధిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బెల్లం కార్తీక్పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ తెలంగాణ రాష్ట్ర 43వ రాష్ట్ర మహాసభలు ఈనెల 23,24,25 తేదీలలో సిద్ధిపేటలో జరుగనున్నట్లు తెలిపారు.ఈ మహాసభలకు వర్ధన్నపేట బాగ్ నుండి విద్యార్థిని విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వర్ధన్నపేట ఏబీవీపీ శాఖ ఆధ్వర్యంలో మహాసభ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట నగర కార్యదర్శి జీవన్, సంయుక్త కార్యదర్శి సన్నీ,కార్యకర్తలు జశ్వంత్, హర్షవర్ధన్,శివాజీ,రోహిత్,తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎలుకుర్తి హవేలి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ధనుర్మాసోత్సవాలు



**గీసుగొండ,16డిసెంబర్, తరంగాలు:** గీసుగొండ మండలంలోని ఎలుకుర్తి హవేలీ గ్రామ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో సోమవారం నుంచి జనవరి 14 వరకు ధనుర్మాస ఉత్సవములు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల పురుషోత్తమ చారి తెలిపారు.సంక్రాంతి నెల ఉదయం 5:00గంటల నుండి శ్రీ స్వామివారికి తిరువారాధన, తిరుప్పావై పారాయణం, స్వామివారి అర్చన,గోదాదేవి అర్చన, నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ధనుర్మాస ఉత్సవమునకై (నెలరోజులు) భక్తుల గోత్రనామాలచే పూజా కార్యక్రమాలు నిర్వహించబడునని ఆలయ ప్రధాన అర్చకులు తిరుమల పురుషోత్తమ చారి ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# పోలీస్ కమిషనర్ ను కలిసిన ఎస్ఐ గోవర్ధన్



**వరంగల్,16డిసెంబర్, తరంగాలు:** వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ను ను నల్లబెల్లి ఎస్ఐ గోవర్ధన్ కలిశారు.నల్లబెల్లి పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన వి.గోవర్ధన్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝాను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం అందజేశారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజలకు నిత్యం అందుబాటులో వుంటూ నీతి, నిజాయితీతో పనిచేయాలని పోలీస్ కమిషనర్ ఎస్ఐ కి సూచించారు.

# ఇందిరమ్మ ఇల్లు కలగానే మిగిలేనా..?

**-ఇందిరమ్మ ఇండ్ల సర్వేలలో తప్పుడు పేర్లు**
**-కంప్యూటర్ ఆపరేటర్ ఇష్టారాజ్యంగా రాసిన పేర్లు**
**-ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు**
**-మాకు సంబంధం లేదంటూ చేతులు దులిపేసుకుంటున్న మున్సిపల్ కమిషనర్**




**తొర్రూర్ డిసెంబర్ 16 తరంగాలు**
మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం, గత కొన్ని సంవత్సరాలుగా ప్రజల అవసరాలను నిర్లక్ష్యం చేస్తోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల వెరిఫికేషన్ ప్రక్రియలో అనేక తప్పిదాలు చోటుచేసుకున్నట్లు సమాచారం రావడంతో ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేస్తున్నావారు. వారి సర్వేలో వచ్చిన పేర్లలో కొన్ని తప్పిదాలు వచ్చాయని ప్రజాపాలన దరఖాస్తులు ఇచ్చిన పేర్లు కాకుండా వేరే పేర్లు రావడం ఆధార్ కార్డు నెంబర్, ఇంటి నెంబర్ అన్ని ఉండి పేరు తప్పు రావడంతో వారికి ఇందిరమ్మ ఇండ్ల సర్వే చేయకుండా తొర్రూర్ మున్సిపల్ అధికారులు నామమాత్రపు సర్వే చేస్తున్నారు.

**పేర్లు తప్పు, నిరాశకు గురవుతున్న ప్రజలు**
ఈ కార్యక్రమంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి ఇళ్ల నంబర్లు, ఇతర వివరాలు సరైనప్పటికీ, వారి పేర్లు తప్పుగా నమోదు కావడం ప్రజల మధ్య ఆవేదనకు కారణమైంది. “ఇల్లు నిర్మించుకున్నదగ్గర వరకు బాగానే ఉంది, కానీ పేర్లు తప్పుగా ఉండటంతో ప్రభుత్వ పథకాల లబ్ధి అందుకోవడంలో సమస్యలు ఎదుర్కొంటున్నాం,” అని బాధితులు తమ అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు.
ఈ సమస్యపై తొర్రూరు మున్సిపాలిటీ కమిషనర్ శాంతికుమార్‌ను వివరణ కోరగా, “మాకు ఎటువంటి సంబంధం లేదు,” అని స్పష్టం చేశారు. స్థానిక అధికారులు ఈ అంశంపై అశ్రద్ధగా స్పందించగా, సమస్యను కలెక్టర్ కార్యాలయానికి తీసుకెళ్లినప్పుడు, అక్కడి అధికారులు కూడా అదే విధంగా, “మా పరిధిలో లేదు,” అని అన్నారు.

**ప్రజలకు న్యాయం ఎప్పుడు?**
స్థానిక ప్రజల అభిప్రాయం ప్రకారం, అధికారులు ఒకరి మీద మరొకరు బాధ్యతలను మోపుతూ, సమస్య పరిష్కారం లేకుండా మూలుగుతున్నారని అంటున్నారు. “ప్రజల సమాచారం సక్రమంగా నమోదు చేయకుండా ఇలా నిర్లక్ష్యం చేస్తే, మరింత సమస్యలు ఎదురవుతాయి,” అని ఒక స్థానిక వ్యక్తి అభిప్రాయపడ్డాడు.

**తక్షణ చర్యల కోసం విజ్ఞప్తి**
ఈ నిర్లక్ష్యాన్ని ప్రభుత్వం గమనించి, సమస్యను పరిష్కరించేలా తక్షణ చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. “మా సమస్యలు పట్టించుకోని అధికారులను బాధ్యతకు లోబర్చాలి,” అని ఒక వ్యక్తి పేర్కొన్నారు. ఈ సమస్యను మీడియా, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడమే కాకుండా, ఇలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టడం అవసరమని బాధితులు తెలిపారు.

## కబడ్డీ క్రీడలను ప్రారంభించిన ఎస్ ఐ బాబు



**మఠంపల్లి,డిసెంబర్16,(తరంగాలు)**
సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం అల్లీపురం గ్రామంలో ఇమ్మానియెల్ యూత్ ఆధ్వర్యంలో క్రిస్మస్ సందర్భంగాఏర్పాటు చేసిన హుజుర్ నగర్, కోదాడ నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను మఠంపల్లి ఎస్ ఐ పి బాబు సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎస్ ఐ మాట్లాడుతూ శాంతియుత వాతావరణంలో క్రీడలు నిర్వహించుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పాస్టర్ మార్టిన్,మాజీ ఎం పి టి సి భరత్ నాయక్,యం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షులు ఇరుగు ప్రభు, యం ఈ ఫ్ మండల నాయకులు చిన్నపంగు విజయ్ కుమార్, రిటైర్డ్ ఉద్యోగులు వీరారెడ్డి, కోటేశ్వరరావు, లక్ష్మయ్య,ఆనందరావ్,పట్టేటి రాజశేఖర్, ఫీల్డ్ అస్సిటెంట్ గోపయ్య, నూకపంగు మహేష్, బూడిగే అనిల్, రాకేష్, పాతకోటి సీమోన్, చరణ్, తామస్, మదన్, మల్లేష్, రవి, రాజు, మనోజ్, బ్రహం, వీరబాబు యూత్ సభ్యులు పాల్గొన్నారు.

## భారతీయ బౌద్ధ మహాసభ ఉమ్మడి వరంగల్,హన్మకొండ జిల్లా ఎన్నికలు




రాష్ట్ర అధ్యక్షులు జి పరంధాములు

**వరంగల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 16,(తరంగాలు)**
సోమవారం రోజు జరిగిన భారతీయ బౌద్ధ మహాసభ ఉమ్మడి వరంగల్,హన్మకొండ జిల్లా ఎన్నికలలో గౌతమ బుద్ధుని ధర్మ బోధనలు వర్తమాన సమాజానికి ఎంతో అవసరం ఉన్నయి అని తెలంగాణ రాష్ట్రం బిఎస్ఐ అధ్యక్షుడు ఉ.జి పరంధాములు అన్నారు. హన్మకొండ బిఎస్ఐ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యన్ సుదర్శనం అధక్షతన వరంగల్,హన్మకొండ జిల్లా కమిటీల కాలవ్యవధి పూర్తి అయ్యినందున నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది.బిఎస్ఐ ఆర్గనైసింగ్ సెక్రెటరీ బొమ్మల అంబేద్కర్ కార్యకర్తలను సమన్వయం చేయగా రాష్ట్ర కమిటీ పర్యవేక్షణలో రెండు జిల్లాల కమిటీలకు కార్యనిర్వాహక కమిటీ ఆమోదం పత్రాలను అందచేయడం జరిగింది.బిఎస్ఐ హన్మకొండ జిల్లా కమిటీ.పి.కృష్ణ స్వామి లాయర్, అధ్యక్షుడు కె లక్ష్మీ తులసి ఉపాధ్యక్షులు పద్మ ఉపాధ్యక్షులు పి సాంబయ్య,కార్యదర్శి జె కిషన్,కోశాధికారిగా రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించి నియామకపు పత్రాలను జారీ చేశారు.ఈ కార్యక్రమం పర్యవేక్షకులుగా డా.కె వెంకటి, సిహెచ్ కొమ్మాలు, టి.సారయ్యలు ఎన్నికైయ్యారు.

## ప్రశాంతంగా డబల్ బెడ్ రూమ్ డిగ్నిటీ హౌసింగ్ అసోసియేషన్ ఎన్నికలు.

**-అధ్యక్షునిగా ఆంజనేయులు...**
**-ప్రధాన కార్యదర్శిగా శివకుమార్...**



**పటాన్ చెరువు డిసెంబర్ 16 ( తరంగాలు)**
పటాన్ చెరువు నియోజకవర్గం పరిధి 2 బి హెచ్ కె డిగ్నిటీ హౌసింగ్, కొల్లూరు సెక్టార్ 1అసోసియేషన్ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ సందర్భంగా తెల్లాపూర్ మునిసిపాలిటీ కొల్లూరు ఫేస్ 2, 2 బి హెచ్ కే హౌసింగ్ అసోసియేషన్ ఎన్నికల్లో భాగంగా అధ్యక్షులుగా ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా శివకుమార్, కోశాధికారిగా అఖిల్ ఎన్నికయ్యారు. అనంతరం ఆంజనేయులు శివకుమార్ లు మాట్లాడుతూ కాలనీలో ఉన్న సమస్యల పరిష్కారానికై ఎల్లవేళలా కృషి చేస్తామని తమపై నమ్మకంతో గెలిపించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సంతోష్, నాగరాజు, లక్ష్మీపతి, రమేష్, గౌస్, రామలింగారెడ్డి, ఎ గంగాధర్, అరుణ్, సాయి, కె ఈ రాణి, ఇబ్రహీం, ప్రవీణ్, ఖలీం, రాజ్ కుమార్, ఫరీద్, అయూబ్ ఖాన్, శ్రీనివాస్, వినయ్ కుమార్, జహంగీర్, జహీర్, నిషా తదితరులు పాల్గొన్నారు.

## కేసముద్రం స్టేషన్లో సిపిఎం పార్టీ ఇంటింటి సర్వే



**కేసముద్రం,డిసెంబర్ 16, (తరంగాలు)**
సోమవారం కేసముద్రం స్టేషన్ లో టౌన్ శాఖ కార్యదర్శి జల్లే జయరాజు ఆధ్వర్యంలో సిపిఎం పార్టీ ఇంటింటి సర్వే నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మార్తినేని పాపారావు,కేసముద్రం మండల సిపిఎం పార్టీ కార్యదర్శి గొడిషాల వెంకన్న మాట్లాడుతూ ప్రజలు గత ఎండాకాలంలో ఉపాధి హామీ పనులు చేసి ఏడు నెలలు కావస్తున్నా ఇప్పటివరకు ఉపాధి హామీ కూలీలకు డబ్బులు చెల్లించడంలో అధికారుల నిర్లక్ష్యం ఎందుకని అన్నారు.తక్షణమే ఉపాధి హామీ కూలీలకు డబ్బులు చెల్లించాలని,లేని ఎడల ఉపాధి హామీ కూలీలతో ఆఫీస్ ముందు ధర్నా నిర్వహిస్తామని తెలిపారు.కేసముద్రం స్టేషన్ ఐదో వార్డులో కరెంటు స్తంభం నడి మధ్యలో నుండి సిసి రోడ్డు వేయడం వల్ల కాళినివాసులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు.కరెంటు స్తంభం మధ్యలో నుండి సిసి రోడ్డు వేసిన అనంతరం అధికారుల నిర్లక్ష్యం,పర్యవేక్షణ లోపం ఉందని తక్షణమే సంబంధిత అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్నటువంటి కరెంటు స్తంభాలను తొలగించాలని కోరారు.ఇల్లు లేని నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని,రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసినారు.ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు వేల్పుగొండ సావిత్ర ,సోమవారం ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డు రకం ధాన్యానికి బోనస్ చెల్లించాలి



**ఇనుగుర్తి, డిసెంబర్ 16, (తరంగాలు)**
కొనుగోలు కేంద్రాల్లో దొడ్డు రకం దాన్యం అమ్ముతున్న రైతులకు బోనస్ వెంటనే చెల్లించాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం (ఏఐకేఎస్) మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య అన్నారు. కేంద్రమైన ఇనుగుర్తి కొనుగోలు కేంద్రం వద్ద ప్రతినిధి బృందంతో నేడు పరిశీలన చేయడం జరిగింది.అనంతరం ఆయన మాట్లాడుతూ ధాన్యం మీద రైతు పండించిన 11 రకాల పంటలకు బోనస్ ఎందుకు ఇవ్వటం లేదని ఆయన ప్రశ్నించారు. తేమ పేరుతో రైతులను కొనుగోలు కేంద్రాల వద్ద వారాల కొద్ది నిరీక్షణ చేసేటట్టుగా చేయటంసరి కాదని ఆయన అన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా శాశ్వత ప్రాతిపదికన నీడ, మంచినీరు సౌకర్యం కల్పించాలని ఆయన కోరారు. తూకాలు వెనువెంటనే చేస్తూ ధాన్యాన్ని తరలించాలని ట్రాన్స్పోర్ట్ ఖర్చులు రైతులకు వెంటనే ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.ఇంకా ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ (ప్రజాపందా) మహబూబాబాద్ డివిజన్ కమిటీ సభ్యులు కందాల రంగయ్య, తో పాటుగా వెంకన్న యాకూబ్ రవి చారి సరోజన యాదయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మంత్రి ఉత్తమ్ బాటలో ముందుకు సాగుతా



**సూర్యాపేట జిల్లా బ్యూరో ,డిసెంబర్ 16,(తరంగాలు)**
రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖ, సివిల్ సప్లై మంత్రి కెప్టెన్ యన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అభిమానిగా ఆయన అనుంగ శిష్యుడు గా సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలోని మంచ్యతండా లో నెలకొని ఉన్న సమస్యల పరిష్కారం కోసం నావంతుగా కృషి చేస్తున్నట్లు మంచ్య తండా కు చెందిన కాంగ్రెస్ పార్టీ యువనాయకుడు, మంత్రి ఉత్తమ్ వీరాభిమాని మాలోతు బాబు నాయక్ తెలిపారు. సోమవారం ఆయన మఠంపల్లి లో విలేఖరులతో మాట్లాడుతూ మంత్రి ఉత్తమ్ సూచనల మేరకు వర్ధాపురం వద్ద ఉన్న కాల్వ నుండి రైతులకు నీరు అందించాలనే లక్ష్యం తో తన స్వంత ఖర్చులతో కాలువను శుభ్రం చేయడం జరిగిందని దీనివల్ల రైతులు ఖరీఫ్ లో వరిపంట దిగుబడి పెరిగిందని అన్నారు. అదేవిధంగా దుప్పల గట్టు బంగారు మైసమ్మ దేవాలయం రోడ్డు మర మత్తలు, ప్రభుత్వ పాఠశాలలో జాతీయ నాయకుల ఫొటోలు పెయింటింగ్ వేయించడం జరిగిందన్నారు.మంత్రి ఉత్తమ్, తండా వాసుల దీవెనలతో మరింత ముందుకు సాగుతానని ప్రజల సమస్యలే పరిష్కార ధ్యేయంగా ముందుకు సాగుతానని తెలిపారు.

## వర్తమాన సమాజానికి బుద్ధుని బోధనలు అవసరం



**వరంగల్ జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 16,(తరంగాలు)**
గౌతమ బుద్ధుని ధర్మ బోధనలు వర్తమాన సమాజానికి ఎంతో అవసరం ఉన్నాయని తెలంగాణ రాష్ట్రం బి.ఎస్.ఐ. అధ్యక్షుడు ఉ.జి పరంధాములు అన్నారు.హన్మకొండ బిఎస్ఐ కార్యాలయంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు యన్.సుదర్శనం అధ్యక్షతన వరంగల్,హన్మకొండ జిల్లా కమిటీల కాలవ్యవధి పూర్తి అయ్యినందున నూతన కమిటీలను ఎన్నుకోవడం జరిగింది.బిఎస్ఐ ఆర్గనైసింగ్ సెక్రెటరీ బొమ్మల అంబేద్కర్ కార్యకర్తలను సమన్వయం చేయగా రాష్ట్ర కమిటీ పర్యవేక్షణలో రెండు జిల్లాల కమిటీలకు కార్యనిర్వాహక కమిటీ ఆమోదం పత్రాలను అందచేయడం జరిగింది. బిఎస్ఐ వరంగల్ జిల్లా కమిటీ ఎ రాములు అధ్యక్షుడు ఎ కుమార స్వామి కార్యదర్శి జి.కొమురయ్య,ఉపాధ్యక్షుడు కొంగర ప్రమోద్ లను వరంగల్ జిల్లా రాష్ట్ర అధ్యక్షుడు ప్రకటించి నియామకపు పత్రాలను జారీ చేశారు.ఈ కార్యక్రమం పర్యవేక్షకులుగా డా.కె వెంకటి, సిహెచ్ కొమ్మా లు, టి.సారయ్యలు ఎన్నికయ్యారు.

## మాజీ సర్పంచ్ పై ఎస్సి,ఎస్టీ కేసు కొట్టివేత

**మఠంపల్లి, డిసెంబర్ 16, (తరంగాలు)**
సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలం రామచంద్రాపురం మాజీ సర్పంచ్ మాలోతు భీముడు నాయక్ పై గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం 2017లో సెర్వె నెంబర్ 540భూమి విషయంలో గొడవలు జరుగగా 2019 ఎన్నికల్లో అక్రమంగా భీముడు పై పెట్టిన యస్సి, ఎస్టీ కేసును సోమవారం నల్గొండ కోర్టు కొట్టి వేసింది. ఆయన తోపాటు సోమ్లా నాయక్, హతిరం నాయక్, కృష్ణ నాయక్, కూడా కేసులో నిర్దోషులు గా పేర్కొంటూ కేసును కొట్టి వేయడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ చివరికి న్యాయమే గెలిస్తుందని తెలిపారు.

## బిజినెస్

# రూ.79 వేల దిగువకు బంగారం.. రెండు సెషన్లలో రూ.4500 తగ్గిన వెండి..!



వరుసగా రెండో సెషన్‌లో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. దేశ రాజధాని ఢిల్లీలో సోమవారం తులం బంగారం (24 క్యారట్స్) ధర రూ.1,150 క్షీణించి రూ.78,350లకు చేరుకున్నది. శుక్రవారం 99.9 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.79,500 వద్ద ముగిసింది. 99.5 శాతం స్వచ్ఛత గల బంగారం తులం ధర రూ.1,150 నష్టంతో రూ.77,950 వద్ద ముగిసింది. గత రెండు సెషన్లలో కిలో వెండి ధర రూ.4,500 తగ్గితే, తాజాగా సోమవారం రూ.300 పతనమై రూ.92,500లకు చేరుకున్నది. శుక్రవారం కిలో వెండి ధర రూ.92,800 వద్ద స్థిర పడింది. మార్కెట్లో అనిశ్చితికి తోడు అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నికైనప్పటి నుంచి బంగారం ధరలు దిగి వస్తున్నాయి. మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసీఎక్స్)లో ఫిబ్రవరి డెలివరీ తులం బంగారం ధర రూ.143 పతనమై రూ.77,279లకు చేరుకున్నది. ఇంట్రాడే ట్రేడింగ్‌లో తులం బంగారం ధర రూ.76,904-రూ.77,295 మధ్య తచ్చాడింది. కిలో వెండి మార్చి డెలివరీ ధర రూ.319 పెరిగి రూ.91,320 వద్ద నిలిచింది. ఇక అంతర్జాతీయ మార్కెట్లో కామెక్స్ గోల్డ్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ బంగారం 2.70 డాలర్లు వృద్ధి చెంది, 2,678.50 డాలర్లు పలికింది. కామెక్స్ సిల్వర్ ఫ్యూచర్స్‌లో ఔన్స్ వెండి ధర 31.11 డాలర్ల వద్ద స్థిర పడింది

### పారాల్లో సవాళ్లు.. 100 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి అంబానీ.. అదానీ ఔట్..!





భారతీయ బిలియనీర్లు ముకేశ్ అంబానీ, గౌతం అదానీ సంపద తగ్గిపోయింది. వారిద్దరూ 100 బిలియన్ డాలర్ల క్లబ్ నుంచి ఔటయ్యారని బ్లూంబర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ పేర్కొంది. వ్యాపార పరంగా వారిద్దరికి ఎదురైన సవాళ్లే కారణమని వెల్లడించింది. రిలయన్స్ అధినేత ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద గత జూలైలో 120.8 బిలియన్ డాలర్లయితే, ఈ నెల 13 కల్లా 96.7 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. రిలయన్స్ అనుబంధ రిటైల్, ఎనర్జీ రంగాలు ఆశించిన మేరకు రాణించక పోవడంతో ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద తగ్గిందని బ్లూంబర్గ్ బిలియనీర్స్ తెలిపింది. ఇక అదానీ గ్రూప్ చైర్మన్ గౌతం అదానీ సంపద 122.3 బిలియన్ డాలర్ల నుంచి 82.1 బిలియన్ డాలర్లకు దిగి వచ్చింది. సౌర విద్యుత్ సరఫరా ఒప్పందాల కోసం భారత్ లోని వివిధ రాష్ట్ర ప్రభుత్వాల అధికారులకు ముడుపులు ఇచ్చారని అమెరికాలో కేసు నమోదు కావడంతో అదానీ గ్రూప్ సంస్థల షేర్లు భారీగా పతనం అయ్యాయి. అంతకు ముందు అమెరికా షార్ట్ షెల్లింగ్ సంస్థ హిండెన్ బర్గ్ రీసెర్చ్ కూడా అదానీ గ్రూప్ సంస్థలపై ఆరోపణలు చేసింది. అదానీ గ్రూప్ తన కంపెనీల షేర్ల విలువ కృత్రిమంగా పెంచిందని హిండెన్ బర్గ్ తెలిపింది. గౌతం అదానీ, ముకేశ్ అంబానీ వ్యక్తిగత సంపద నష్టపోయినా, దేశంలోని టాప్-20 బిలియనీర్ల సంపద 67.3 బిలియన్ డాలర్లు వృద్ధి చెందడం గమనార్హం. వారిలో ప్రముఖ పారిశ్రామికవేత్త శివ్ నాడార్ 10.8 బిలియన్ డాలర్లు, ఉక్కు పారిశ్రామికవేత్త సావిత్రి జిందాల్ 10.1 బిలియన్ డాలర్ల సంపద పెంచుకున్నారు.

# లాభాల స్వీకరణకు అవకాశం!

**మార్కెట్ పల్స్**

దేశీయ స్టాక్ మార్కెట్లలో లాభాల జోష్ కనిపిస్తున్నది. ఒడిదొడుకులు చోటుచేసుకుంటున్నా స్థూలంగా మదుపరులు పెట్టుబడులకే ప్రాధాన్యతనిస్తున్నారు. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బీఎస్ఈ ప్రధాన సూచీ సెన్సెక్స్ 623.07 పాయిం ట్లు లేదా 0.76 శాతం ఎగబాకి 82,133.12 వద్ద నిలిచింది. ఇక ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 90.50 పాయింట్లు లేదా 0.36 శాతం ఎగిసి 24,768.30 దగ్గర ముగిసింది. అయితే ఈ వారం ఈ లాభాలను మదుపరులు ఒడిసిపట్టుకోవచ్చన్న అంచనాలున్నాయి.



కానీ నవంబర్‌లో ద్రవ్యోల్బణం తగ్గుముఖం పట్టడం మార్కెట్ సెంటిమెంట్‌ను బలపరుస్తున్నది. ఫలితంగా ఇన్వెస్టర్లు పెట్టుబడులకు పెద్దపీట వేసే వీలు కూడా ఉందంటున్నారు. ఇక ఈ వారం డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ కదలికలు, గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలు ప్రధానం. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 24,400 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,200 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 25,100-25,300 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

## స్పోర్ట్స్

# గబ్బా టెస్ట్‌లో బుమ్రా డబుల్ ఫీట్.. ఆస్ట్రేలియా టూర్‌లో 50 టెస్ట్ వికెట్లు..!



ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడో టెస్టులో మూడోరోజు భారత స్టార్ బౌలర్ జస్ప్రీత్ బుమ్రా డబుల్ ఫీట్ సాధించాడు. బ్రిస్బేన్‌లోని గబ్బా వేదికగా జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో బుమ్రా 76 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టాడు. ఈ సిరీస్‌లో టీమిండియా సక్సెఫుల్ బౌలర్‌గా బుమ్రా నిలిచాడు. పెర్త్‌లో జరిగిన తొలి మ్యాచ్‌లో జట్టు విజయం సాధించడంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే.మూడో టెస్ట్‌లో రెండోరోజు ట్రావిస్ హెడ్, స్టీవ్ స్మిత్ జోడీ నాలుగో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నెలకొల్పింది. ఈ భాగస్వామ్యానికి బుమ్రా బ్రేక్ వేస్తూ.. ఇద్దరిని పెవిలియన్‌కు పంపాడు. కొత్త బంతితో తొలి సెషన్‌లో ఆస్ట్రేలియాను ఇబ్బందులకు గురి చేశాడు. ఉస్మాన్ ఖవాజా, నాథన్ మెక్‌స్వీనీలను అవుట్ చేసి షాక్ ఇచ్చాడు. ఆ తర్వాత ట్రావిస్ హెడ్, స్మిత్ జోడీ నాలుగో వికెట్‌కు 242 పరుగుల భాగస్వామ్యం నమోదు చేయగా.. ఇద్దరిని వరుసగా ఔవుట్ చేశాడు. స్మిత్‌ను రోహిత్ శర్మ క్యాచ్ పట్టగా.. వికెట్ కీపర్ రిషబ్ పంత్ చేతికి హెడ్ చిక్కాడు. అలాగే, మిచెల్ మార్ష్ ఇచ్చిన క్యాచ్ బుమ్రా ఒడిసిపట్టాడు.

**ప్రసన్నను అధిగమించిన మిస్టరీ బౌలర్**

మూడోరోజు సైతం బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. మిచెల్ స్టార్క్.. బుమ్రా బౌలింగ్‌లో పంత్‌కి క్యాచ్ అవుట్ అయ్యాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు బుమ్రా అత్యధికంగా వికెట్లు తీశాడు. ఈ సిరీస్‌లో ఇప్పటి వరకు 18 వికెట్లు తీశాడు. మిస్టరీ బౌలర్ స్పెల్ బ్రిస్బేన్‌లోని గబ్బా మైదానంలో టీమిండియా బౌలర్ అత్యుత్తమ ప్రదర్శన ఇదే. ఇంతకు ముందు జనవరి, 1968లో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడో టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో 104 పరుగులకు ఆరు వికెట్లు తీసిన ఎరపల్లి ప్రసన్నను అధిగమించాడు.

**ఆస్ట్రేలియా గడ్డపై 50 వికెట్లు..**

ఆస్ట్రేలియా పర్యటనలో జస్ప్రీత్ బుమ్రా 50 టెస్ట్ వికెట్ల ఫీట్‌ను అందుకున్నాడు. ఆస్ట్రేలియా గడ్డపై బుమ్రా కంటే ఉమేశ్ యాదవ్ ఎక్కువ వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా ఘనత సాధించాడు. ఉమేశ్ 17 మ్యాచ్‌ల్లో 53 వికెట్లు తీశాడు. బుమ్రా కేవలం 10 మ్యాచ్‌ల్లోనే 50 వికెట్లు పడగొట్టిన బౌలర్‌గా నిలిచాడు. ఈ ఫాస్ట్ బౌలర్ సగటు 17.62 కాగా.. కపిల్‌దేవ్ రికార్డును సైతం అధిగమించే అవకాశం ఉంది. ఆస్ట్రేలియా పర్యటనలో కపిల్ దేవ్ 51 వికెట్లు పడగొట్టాడు.


# ఆస్ట్రేలియాదే పైచేయి.. ఇండియా 51/4




బ్రిస్బేన్‌లో జరుగుతున్న మూడవ టెస్టులో మూడవ రోజు ఆస్ట్రేలియా పై చేయి సాధించింది. ఫస్ట్ ఇన్నింగ్స్‌లో తొలుత 445కు ఆలౌటైన ఆస్ట్రేలియా.. ఆ తర్వాత ఇండియన్ టాప్ ఆర్డర్‌ను ఇబ్బందిపెట్టింది. వర్షం వల్ల ఆట నిలిచిపోయే సమయానికి ఇండియా నాలుగు వికెట్లు కోల్పోయి 51 రన్స్ చేసింది. ఆసీస్ పేస్ అటాక్ ముందు.. భారత బ్యాటర్లు చేతులెత్తేశారు. జైస్వాల్ 4, గిల్ 1, కోహ్లి 3, పంత్ 9 రన్స్ చేశారు.అంతకముందు ఆస్ట్రేలియా ఇవాళ ఉదయం 40 రన్స్ జోడించి 445 రన్స్‌కు ఆల్ అవుట్ అయ్యింది. భారత బౌలర్లలో బుమ్రా అద్భుతంగా బౌల్ చేశాడు. 76 రన్స్ ఇచ్చి అతను ఆరు వికెట్లు తీసుకున్నాడు. ఆసీస్ బ్యాటర్ అలెక్స్ క్యారీ 88 బంతుల్లో 70 రన్స్ చేశాడు. ఆసీస్ బ్యాటర్లలో స్టీవ్ స్మిత్, ట్రావిస్ హెడ్.. సెంచరీలు చేసిన విషయం తెలిసిందే. రెండో సెషన్‌లో వర్షం రావడంతో ఆట నిలిచిపోయింది. మళ్లీ టీ బ్రేక్ తర్వాత కేవలం 17 బంతులే ఆడిన తర్వాత వర్షం వచ్చింది. లైట్ కూడా డిమ్‌గా ఉండడంతో.. ఆటను రద్దు చేశారు. భారత బ్యాటర్లలో కేఎల్ రాహుల్ ఒక్కడే స్థిరంగా ఆడాడు. ఆస్ట్రేలియా పేస్ అటాక్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. మిగితా టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఎవరూ క్రీజ్‌లో నిలదొక్కుకోలేకపోయారు. మిచెల్ స్టార్క్, జోష్ హేజిల్‌వుడ్ వేగం ముందు భారత బ్యాటర్లు తేలిపోయారు. మేటి బ్యాటర్ కోహ్లీ కూడా ఈజీగా చిక్కేశాడు. భారత్ ఇంకా 394 పరుగులు వెనుకబడి ఉన్నది.

# బౌలర్ ఆకాశ్ దీప్‌పై సీరియస్ అయిన రోహిత్ శర్మ..

ఆస్ట్రేలియాతో జరుగుతున్న మూడవ టెస్టు.. మూడవ రోజు భారత కెప్టెన్ రోహిత్ శర్మ తన సహనాన్ని కోల్పోయాడు. బౌలర్ ఆకాశ్ దీప్‌ను తిట్టేశాడు. ఆస్ట్రేలియా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేస్తున్న సమయంలో.. ఆకాశ్ దీప్ 114 ఓవర్ వేశాడు. అయితే ఆ ఓవర్‌లో భారీ వైడ్ వేశాడు. ఇక కీపర్ రిషబ్ పంత్.. తన ఎడమవైపు డైవ్ చేస్తూ పట్టుకున్నాడు. చాలా కష్టంగా అతను కీపింగ్ చేయాల్సి వచ్చింది. ఆఫ్ స్టంప్‌పై దూరం విసిరిన ఆ బంతి పట్ల.. కెప్టెన్ రోహిత్ శర్మ ఆగ్రహం వ్యక్తం చేశాడు. మెదడు ఉందా అన్నట్లు తిట్టుతూ సంకేతం చేశాడు. అబే సర్ మె కుచ్ హై అని రోహిత్ ఆవేశంగా అనేశాడు. ఆ తిట్టు కాస్త .. స్టంప్ మైక్‌కు చిక్కింది.



ఇక కామెంటరీ బాక్సులో జోకులు పూశాయి.





# సల్మాన్ ఖాన్ సికిందర్ టీజర్ టైం ఫిక్స్.. డబుల్ ట్రీట్‌కు రెడీనా..?


బాలీవుడ్ స్టార్ యాక్టర్ సల్మాన్ ఖాన్ టైటిల్ రోల్ పోషిస్తున్న చిత్రం 'సికందర్' కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ ఏఆర్ మురుగదాస్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా 2025 ఈద్ కానుకగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుండగా.. విడుదల తేదీని ప్రకటించాల్సి ఉంది. కాగా అప్‌డేట్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మూవీ లవర్స్ కోసం అదిరిపోయే వార్త బయటకు వచ్చింది.సికిందర్ టీజర్ టైం రానే వచ్చింది. సల్మాన్‌ఖాన్ బర్త్ డే సందర్భంగా డిసెంబర్ 27న సికిందర్ టీజర్ విడుదల చేయనున్నారు. ఈ విషయాన్ని మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఇంకేంటి మరి సల్లూభాయ్ అభిమానులు డబుల్ సెలబ్రేషన్స్‌కు రెడీగా ఉండండి. ఈ చిత్రంలో కన్నడ భామ రష్మిక మందన్నా ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. కాజల్ అగర్వాల్ కీలక పాత్రలో నటిస్తోంది ఈ చిత్రాన్ని నడియాద్వాలా గ్రాండ్‌సన్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై సాజిద్ నడియాద్వాలా నిర్మిస్తుండగా.. పాపులర్ యాక్టర్ సత్యరాజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు.సమాజంలోని అవినీతి, నేరాలకు వ్యతిరేకంగా పోరాడే వ్యక్తి కథ నేపథ్యంలో మురుగదాస్ ఈ సినిమాను తెరకెక్కిస్తున్నాడని బీటౌన్ సర్కిల్ ఇన్‌సైడ్ టాక్. ఓ వైపు ఎమోషన్స్‌ను హైలెట్ చేస్తూనే.. మరోవైపు అభిమానులకు గూస్ బంప్స్ తెప్పించే హై ఆక్టేన్ యాక్షన్ సీక్వెన్స్ ఉండబోతున్నాయట.

# కిరాటగా మోహన్ లాల్..

**'కన్నప్ప' నుంచి ఫస్ట్ లుక్ రిలీజ్**

ఒకవైపు ఫ్యామిలీ గొడవలతో సతమవుతున్న మంచు ఫ్యామిలీ.. మరోవైపు తమ కలల ప్రాజెక్ట్ కన్నప్పను పూర్తి చేసే పనిలో పడింది. మంచు కుటుంబం నుంచి వస్తున్న మోస్ట్ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ కన్నప్ప . దాదాపు రూ.100 కోట్ల బడ్జెట్‌తో వస్తున్న ఈ సినిమాను కలెక్షన్ కింగ్ మంచు మోహన్ బాబు నిర్మిస్తుండగా.. మంచు విష్ణు కథానాయకుడిగా నటిస్తున్నాడు. హిస్టారికల్ కం మైథాలాజీ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ చిత్రంలో ప్రభాస్‌తో పాటు బాలీవుడ్, కోలీవుడ్ అగ్ర తారలు నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ చిత్రానికి మహాభారతం సీరియల్ ఫేమ్ ముఖేష్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఇప్పటికే ఈ మూవీ నుంచి మంచు మోహన్ బాబు, మంచు విష్ణులతో పాటు ప్రముఖుల ఫస్ట్ లుక్‌లను పంచుకున్న చిత్రబృందం తాజాగా మళయాలం స్టార్ నటుడు మోహన్ లాల్ ఫస్ట్ లుక్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో లాలెట్టన్ (మోహన్ లాల్) కిరాట అనే పవర్‌ఫుల్ రోల్‌లో కనిపించబోతున్నట్లు చిత్రబృందం తెలిపింది.



# సీమ బ్యాక్‌డ్రాప్ లవ్‌స్టోరీతో అఖిల్ అక్కినేని కొత్త సినిమా..

కెరీర్‌లో సరైన బ్రేక్ ఎదురుచూస్తున్న యాక్టర్లలో ఒకరు అక్కినేని అఖిల్ . గతేడాది సురేందర్ రెడ్డి దర్శకత్వంలో నటించిన ఏజెంట్ బాక్సాఫీస్ వద్ద బోల్తా కొట్టింది. ఇప్పటివరకు నటించిన బ్యాక్ టు బ్యాక్ సినిమాలు ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఇంప్రెస్ చేయకపోవడంతో.. అఖిల్ నెక్ట్స్ ఏ సినిమా ప్రకటిస్తాడా.. ? అని ఎదురుచూస్తున్న వారి కోసం కొత్త అప్‌డేట్ తెరపైకి వచ్చింది.అఖిల్ కొత్త ప్రాజెక్ట్ రాయలసీమ బ్యాక్ డ్రాప్‌లో సాగే ప్రేమ కథని తెలుస్తోంది. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీ లాంచ్ కూడా పూర్తయినట్టు వార్తలు వస్తుండగా.. మేకర్స్ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఈ చిత్రానికి ఎస్ థమన్ సంగీతం అందించనున్నాడు. అంతేకాదు ఈ మూవీలో డ్యాన్సింగ్ క్వీన్ శ్రీలీల అఖిల్‌కు జోడీగా కనిపించబోతుందని.. హొంబ్యానర్లపై నాగార్జున, నాగవంశీ సంయుక్తంగా తెరకెక్కించనున్నారని ఇన్ సైడ్ టాక్ మురళీ కిశోర్ అబ్బూరు వినరో భాగ్యము విష్ణు కథ చిత్రాన్ని తెరకెక్కించాడు. మరి ఈ డైరెక్టర్ అఖిల్‌కు మంచి బ్రేక్ ఇస్తాడా..? అన్నది తెలియాల్సి ఉంది. అఖిల్ నిశ్చితార్థం జైనబ్ రవ్జీ తో నవంబర్ 26న ఘనంగా జరిగింది. వీరి వెడ్డింగ్ వివరాలపై క్లారిటీ రావాల్సి ఉంది.



# సినిమా షూటింగ్‌లో ప్రభాస్‌కు గాయం.!

కథానాయకుడు ప్రభాస్ తృటిలో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. ఓ సినిమా షూటింగ్‌లో భాగంగా.. ఆయన గాయపడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుస్తుంది. అయితే ఈ విషయాన్ని ప్రభాస్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడుఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. నాగ్ అశ్విన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలవడమే కాకుండా రూ.1100 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టింది. అయితే ఈ సినిమాను వచ్చే ఏడాది జపాన్‌లో విడుదల చేస్తున్నారు మేకర్స్. జనవరి 3న జపాన్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా జపాన్‌లో ప్రమోషన్స్‌లో పాల్గొనాల్సి ఉంది ప్రభాస్. అయితే తాను ఈ వేడుకకు రాలేకపోతున్నానని ప్రభాస్ వెల్లడించారు. మీరు నాపై చూపిస్తున్న ప్రేమకు, అభిమానాలకు ధన్యవాదాలు. జపాన్‌లోని అభిమానులని కలవాలని ఎప్పటినుంచో అనుకుంటున్నా. కానీ మూవీ షూటింగ్‌లో నా కాలుకు గాయమైంది. దీంతో ఈ జపాన్‌కు రాలేకపోతున్న.. ఈ విషయంలో నన్ను క్షమించండి అంటూ ప్రభాస్ రాసుకోచ్చాడు



# ఎంటర్‌టైనింగ్ బ్లాస్ట్.. లైలాగా విశ్వక్‌సేన్ థియేటర్లలోకి వచ్చే టైం ఫిక్స్

టాలీవుడ్ యాక్టర్ విశ్వక్‌సేన్ వరుస సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి VS 12. లైలా టైటిల్‌తో వస్తున్న ఈ చిత్రానికి రామ్ నారాయణ్ (డెబ్యూ) దర్శకత్వం వహించబోతున్నాడు. ఈ సినిమాలో విశ్వక్‌సేన్ లేడీ గెటప్‌లో కనిపించబోతుండగా.. ఇప్పటికే విడుదల చేసిన ఫస్ట్ లుక్ సినిమాపై ఆసక్తిని రేకెత్తిస్తుంది.తాజాగా సినిమా విడుదల తేదీని ప్రకటిస్తూ కొత్త లుక్ విడుదల చేశారు. స్టైలిష్ గాగుల్స్‌లో డ్యుయల్ ప్యాంట్‌తో ట్రెండీగా కనిపిస్తూ సినిమాపై క్యూరియాసిటీ పెంచుతున్నాడు. ఈ చిత్రాన్ని వాలెంటైన్స్ డే సందర్భంగా ఫిబ్రవరి 14న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు. లైలా తొలి గులాబి న్యూఇయర్ 2025కు రాబోతుంది. ఈ వాలెంటైన్స్ దేకు ఎంటర్‌టైనింగ్ బ్లాస్ట్ ఉండబోతుందంటున్నారు. ఈ చిత్రంలో ఆకాంక్ష శర్మ ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**